ఆదివారం
01-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 72
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యాలో హెలికాప్టర్ అదృశ్యం

మాస్కో: రష్యాలో ఎంఐ8 హెలికాప్టర్ అదృశ్యమైంది. అందులో ముగ్గురు సిబ్బంది, 19 మంది ప్రయాణికులు ఉన్నారు. తూర్పు ప్రాంతంలోని కమ్‌చట్కా ద్వీపం నుంచి శనివారం బయలుదేరిన హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్ది సేపటికే అదృశ్యమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. కమ్‌చట్కా ద్వీపంలోని వాచ్‌కాజెట్స్ అగ్ని పర్వతం సమీపంలో ఎంఐ8 హెలికాప్టర్ టేకాఫ్ అయింది కానీ గమ్యస్థానానికి చేరుకోలేదు రష్యా ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ ఒక ప్రకటన వెలువరించింది. అయితే ఈ హెలికాప్టర్ ప్రమాదానికి గురైవుండవచ్చని, ప్రయాణికులంతా చనిపోయి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అధికారులు విచారణను చేపట్టారు.

కాంస్యంతో మెరిసిన రుబీనా

పారిస్: పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు రాణిస్తున్నారు. మరో పతకాన్ని తెచ్చిపెట్టారు. షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ కాంస్యం సాధించారు. 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్ 1 ఫైనల్‌లో 211.1 స్కోరు చేశారు. ఎనిమిది మందిలో మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడవ స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు చేరుకున్నారు. జవాన్నార్డి సారె (ఇరాన్) స్వర్ణం... ఐసెల్ ఓజ్గాన్ (టర్కీ) రజతం చేజిక్కించుకున్నారు. రుబీనా పతకం గెలవడంతో భారత్ పతకాల సంఖ్య ఐదుకు చేరింది.

అక్టోబరు 5న హర్యానా ఎన్నికలు

న్యూదిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీని ఎన్నికల సంఘం సవరించింది. అక్టోబరు 1వ తేదీకి బదులు 5వ తేదీకి మారుస్తూ శనివారం నోటిఫికేషన్ జారీచేసింది. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో ఓట్ల లెక్కింపును అక్టోబరు 4వ తేదీకి బదులు అక్టోబరు 8న చేపట్టనున్నట్లు వెల్లడించింది. శతాబ్దాల నాటి బిష్ణోయ్ వర్గ ఉత్సవం కారణంగా పోలింగ్ తేదీని మార్చినట్లు పేర్కొంది. పోలింగ్ తేదీ మార్చాలని అఖిలభారత బిష్ణోయ్ మహాసభ, బికానీర్ (రాజస్థాన్) నుంచి తమకు ఫిర్యాదులు వచ్చాయని ఎన్నికల కమిషన్ తెలిపింది.

ధరలపై నేటి నుంచి సీపీఐ ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలన్న డిమాండ్లతో ఈనెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో సీపీఐ ఆందోళనలు నిర్వహించనుంది. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆందోళనలు కొనసాగుతాయి. పెరిగిన ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టత, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు తదితర డిమాండ్లతో పార్టీ శ్రేణులు నిరసనకు దిగనున్నాయి. చివరి రోజైన 6వ తేదీన కలెక్టరేట్ల ఎదుట పెద్దఎత్తున ధర్నాలు చేస్తారు.

కుండపోత

పొంగిన డ్రెయిన్లు, వాగులు... రహదారులు జలమయం

విజయవాడ, గుంటూరు నగరాలు అస్తవ్యస్తం

భారీ వర్షాలకు 8 మంది మృతి... విద్యా సంస్థలకు సెలవు

కారు కొట్టుకుపోయి ఉపాధ్యాయుడు, ఇద్దరు పిల్లల దుర్మరణం

20 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

మరింత అప్రమత్తం

చంద్రబాబు ఆదేశం

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉండే అవకాశం ఉందని, కింది స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలపై సీఎస్, డీజీపీ, మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా వర్షాలపై పరిస్థితిని శనివారం సీఎం సమీక్షించారు. అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీజేశారు. భారీ వర్షాలు, వరదల

- మిగతా 2 లో

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బంగాళాఖాతంలో అల్పపీడనంతో రాష్ట్రంలో కుండపోత వాన కురిసింది. ప్రత్యేకించి ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలను వర్షం ముంచెత్తింది. గత 24 గంటలుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. ప్రధానంగా కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలపై దీని ప్రభావం అధికంగా నెలకొంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ వర్షాలు పడ్డాయి. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి

జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్ఆర్ జిల్లాల్లో అక్కడక్కడ చెదురుమదురు వానలు కురిశాయి. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగాయి. గ్రామ, మండల, జాతీయ రహదారులనే తేడా లేకుండా వర్షపు ముంచెత్తాయి. భారీవర్షాలతో రహదారులు మునిగిపోవడంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆర్టీసీ బస్సులు, వాహన చోదకులకు అసౌకర్యం ఏర్పడింది. విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే 20 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డివిజన్ ప్రకటించింది. కోస్తాజిల్లాల్లో చాలా చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలతో ఇళ్లు కూలిపోయాయి. రోడ్లపై చెట్ల కొమ్మల పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తూర్పుగోదావరిలో ఏకధాటిగా వర్షాలతో ప్రధాన రహదారులు నీటితో ముంచెత్తాయి. కోనసీమలో వరినాట్ల పనులకు ఆటంకం ఏర్పడింది. సముద్రతీర ప్రాంతంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని

- మిగతా 2 లో

విజయవాడలో మహా విషాదం

కొండచరియలు విరిగిపడి ఐదుగురి మృతి

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఇద్దరు గల్లంతయ్యారు.

6లో

గుడ్లవల్లేరు ఘటనపై
విద్యార్థినుల ఆందోళన

- మద్దతు తెలిపిన ఏఐఎస్ఎఫ్
- విద్యార్థి నేతల అరెస్టు
- కళాశాల యాజమాన్యం ద్వంద్వ వైఖరి జాన్సన్‌బాబు

విశాలాంధ్ర-గుడివాడ: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో అమ్మాయిల హాస్టల్‌లో రహస్య కెమెరాల వ్యవహారం ముదిరిపాకాన పడుతోంది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు శనివారం కాలేజీ వద్ద ఆందోళనకు దిగారు. విద్యార్థుల ఆందోళనకు ఏఐఎస్ఎఫ్ మద్దతుగా నిలిచింది. విద్యార్థినులను

- మిగతా 2 లో

సంక్షోభంలో ఎన్డీయే ప్రభుత్వం

- మోదీ గ్రాఫ్ రోజురోజుకు పతనం
- బీజేపీకి చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం సంక్షోభంలో పడింది. దేశంలో నరేంద్రమోదీ గ్రాఫ్ రోజు రోజుకూ తగ్గుతోంది. మోదీని మార్చాలని బీజేపీ నేతలే అంటున్నారు. మోదీ తీరుపై ఆర్ఎస్ఎస్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2109లో బీజేపీకి 300కి పైగా సీట్లు వచ్చాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 సీట్లు సాధిస్తామని మోదీ గొప్పలు చెప్పారు. చివరకు 240కే పరిమితం కావాల్సి వచ్చింది. గతంతో పోల్చితే బీజేపీకి 60 సీట్లుకు పైగా తగ్గాయి. మోదీ గ్రాఫ్ తగ్గుతోందడానికి ఈ ఫలితాలే నిదర్శనం. మోదీ నియంతృత్వ పోకడలతో జనం విసిగిపోయారు. బంగ్లాదేశ్ పరిస్థితులు భారత్‌లో వచ్చే పరిస్థితి ఉంది. నియంతలా వ్యవహరిస్తున్న నరేంద్రమోదీకి చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలి. ఏపీ హక్కులను భయంతో కాకుండా రాజ్యాంగ బద్ధంగా చంద్రబాబు అడగాలి. వైసీపీ హయాంలో ఏపీలో జరిగిన భూ అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. యాప్ రుణాల పేరుతో వేధించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి' అని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలో గల గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. దేశంలో నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని నారాయణ విమర్శించారు. ప్రభుత్వ విధానాల వలనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. 2014లో రూ.2.25 వేల కోట్ల ఎన్‌పీఏలు ఉండేవని, ఇపుడది రూ.17 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల ఆస్తులు పెరుగుతున్నాయని, పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న

- మిగతా 2 లో

కలుషిత ఆహారంతో 100 మందికి అస్వస్థత

- ఆసుపత్రికి తరలించిన జామ్‌గూడ పాఠశాల సిబ్బంది
- భయాందోళనలో తల్లిదండ్రులు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: అధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, స్వచ్ఛతకు, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు కలుషిత ఆహారంతో ఆసుపత్రులపాలౌతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో చిన్నారులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారు. ప్రభుత్వ పెద్దలు హెచ్చరిస్తున్నా... అధికారులు పెడచెవిన పెడుతుండడంతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!



నాది చాలా మంచి వ్యక్తిత్వం సార్! ఎక్కువ కబ్జాలు చేయలేదు, లేడీసుని కొద్దిమందినే ఏడిపించా.

గాడితప్పిన విద్యా వ్యవస్థ

- కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ
- కొనసాగుతున్న ఆత్మహత్యల పరంపర
- విద్యార్థినుల గోప్యతకూ భంగం
- కలుషిత ఆహారభూతానికీ బలి
- యాజమాన్యాల ఒత్తిడితో మొక్కుబడిగా కేసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల కార్యకలాపాల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మూడు నెలలుగా విద్యార్థుల అస్వస్థత, ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. ర్యాగింగ్ ఘటనలు, యాజమాన్యం ఫీజుల ఒత్తిళ్లు, వేధింపులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు కలుషిత ఆహార భూతానికి బలౌతున్నారు. ఏలూరు, విశాఖ, కాకినాడ, అల్లూరి, అనాకపల్లి జిల్లాల్లో ఈ ఘటనలు

- మిగతా 2 లో

వైద్యుల రక్షణకు చట్టం చేయాల్సిందే

ఐఎంఏ డిమాండ్



న్యూదిల్లీ: వైద్యులు, ఆస్పత్రులపై హింసకు వ్యతిరేకంగా కేంద్ర చట్టాన్ని వెంటనే తీసుకురావాలని, ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) శనివారం మరోసారి డిమాండ్ చేసింది. ఆరోగ్య సంరక్షణ నిపుణుల భద్రత భరోసా కోసం ప్రామాణికాలను రూపొందించేందుకు ఏర్పాటయిన నేషనల్ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టీఎఫ్) కు ఈ మేరకు లేఖ రాసింది. జాతీయ ఏకాభిప్రాయాన్ని రూపొందించడానికి, భాగస్వాములందరితో తగిన సంప్రదింపులతో ప్రామాణికాలను రూపొందించడానికి సుప్రీం కోర్టు ఎన్‌టీఎఫ్‌ను ఏర్పాటు చేసిందని ఐఎంఏ తన మూడు భాగాల లేఖలో తెలిపింది. కోల్‌కతాలోని ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై ఇటీవల హత్యాచారం ఘటన జరిగిన తర్వాత వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణుల నిరసనల నేపథ్యంలో సుప్రీం కోర్టు ఎన్‌టీఎఫ్‌ను ఏర్పాటు చేసింది. ముందుగా, వైద్యులు, ఆస్పత్రులపై హింసపై కేంద్ర చట్టం కోసం తన డిమాండ్, సమర్థనను తెలియజేస్తూ, ఐఎంఏ తన అధ్యయనాన్ని సమర్పించింది. 'రాత్రి డ్యూటీ సమయంలో భద్రత-భారతదేశం అంతటా 3885 వైద్యుల సర్వే', కేంద్ర చట్టం కోసం దాని ముసాయిదా ప్రతిపాదన, ముసాయిదా చట్టం-'ది హెల్త్‌కేర్ సర్వీస్ పర్సనల్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (హింస నిషేధం, ఆస్తికి నష్టం) బిల్లు, 2019', అంటువ్యాధి వ్యాధుల (సవరణ) చట్టం సెప్టెంబరు 2020 అనుబంధాలుగా ఉన్నాయి.

హసీనా అప్పగింతే కీలకం

భారత్‌తో బంధంపై బీఎన్‌పీ

ఢాకా: భారత్‌తో బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాల సరికొత్త అధ్యాయం ప్రారంభంలో మాజీ ప్రధాని హసీనా అప్పగింత అంశం కీలకపాత్ర పోషిస్తుందని బీఎన్‌పీ (బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ) తెలిపింది. ఈ విషయాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం ఆలంగిర్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో శనివారం వెల్లడించారు. ఆమెకు భారత్‌లోనే ఆశ్రయం కొనసాగితే భవిష్యత్తులో రెండుదేశాల సంబంధాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. న్యూదిల్లీతో బలమైన సంబంధాలను బీఎన్‌పీ కోరుకుంటోందని ఆయన తెలిపారు. గతంలో ఉన్న విభేదాలను మరిచి తాము ముందుకు వెళ్లాలనుకుంటున్నామన్నారు. భారత భద్రతకు ముప్పు కలిగించే ఎటువంటి చర్యలనైనా తమ భూభాగంపై అనుమతించబోమన్నారు. ఒకవేళ బీఎన్‌పీ ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో అధికారం చేపడితే అదానీతో గతంలో అవామీ లీగ్ కుదుర్చుకొన్న ఒప్పందాన్ని పునః సమీక్షిస్తామని ఆలంగిర్ తేల్చిచెప్పారు. ఆ ఒప్పందం బంగ్లాదేశ్ ప్రజలపై తీవ్ర ఒత్తిడి తెస్తోందన్నారు. బంగ్లాదేశ్ ప్రజలను అర్థం చేసుకోవడంలో భారత్ దౌత్యం విఫలమైందని అభిప్రాయపడ్డారు. ప్రజా తిరుగుబాటుతో హసీనా ప్రభుత్వం కూలిపోయినా... న్యూదిల్లీ బీఎన్‌పీతో సంప్రదింపులు జరపడం లేదని తెలిపారు. ఇప్పటికే అమెరికా, చైనా, బ్రిటన్, పాకిస్థాన్ తమను

సంప్రదించాయని గుర్తు చేశారు. మైనార్టీ రక్షణ బంగ్లాదేశ్ అంతర్గత విషయమని స్పష్టంచేశారు. హిందువులపై దాడులు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. వాటిల్లో చాలా వరకు రాజకీయ ప్రేరితమైనవి వెల్లడించారు. ఏడాదిలోగా దేశంలో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో చేసిన నేరాలు, అవినీతికి షేక్ హసీనా ఢాకాలో కచ్చితంగా విచారణ ఎదుర్కొని తీరాల్సిందేని తేల్చిచెప్పారు. ఆమెకు , అవామీ లీగ్‌పార్టీకి అండగా నిలిస్తే... తమ దేశంలో భారత్‌పై అభిప్రాయం దెబ్బతింటుందన్నారు.

హారిస్ మనకు అవసరమా?

ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... తన ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. ప్రముఖ మీడియా సంస్థకు హారిస్ ఇచ్చిన ఇంటర్వ్యూను ఉద్దేశిస్తూ ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'నిన్న రాత్రి టెలివిజన్‌లో మీరు ఆమె(కమలా హారిస్)ను చూశారా? ఇలాంటి వ్యక్తి మన దేశ అధ్యక్ష స్థానంలో ఉండగలరా?' అంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. దీనిపై మీడియా ప్రశ్నించగా హారిస్ స్పందిస్తూ... 'మళ్లీ అదే పాత ప్రశ్న ఎదురవుతోంది. ఇది కాకుండా తరువాతి ప్రశ్న అడగండి' అని ఆమె బదులిచ్చారు. హారిస్ ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ తాజాగా ఆమెపై ట్రంప్ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. 'ఇది అసలు ఇంటర్వ్యూనే కాదు. ఇది అంత గొప్ప స్థాయిలో లేదు. ఆమె ఇంకాస్త బాగా మాట్లాడాల్సింది. అంత ఉన్నతంగా కాకపోయినా మామూలుగా మాట్లాడినా దాన్ని ఇంటర్వ్యూగా భావించవచ్చు. దీన్ని మనమంతా చూశాం. ఆమెకు అవగాహన లేదు. ఈ విషయం అందరికీ తెలిసిందే' అని ట్రంప్ విమర్శించారు. కాగా... ఇటీవల పెన్సిల్వేనియాలోని విల్కెస్-బారేలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ట్రంప్... కమలా హారిస్‌పై తీవ్రస్థాయిలో వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తెలిసిందే. హారిస్ భయంకరంగా నవ్వుతారని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీంతో పాటు అమెరికాలోని ప్రధాన పత్రికలను కూడా ఆయన తప్పుపట్టారు. కమలా హారిస్ నవ్వడంపై నిషేధం ఉందన్నారు.

దీంతో ఆమె నోరు మూసుకుని తిరుగుతున్నారని, ఆమె నవ్వాలని కోరుకుంటున్నానని వెటకారంగా అన్నారు. టైమ్ మ్యాగజైన్ వద్ద ఆమె ఫొటోలే లేవని ఎద్దేవా చేశారు. వారి కళాకారులు మాత్రం ఆమె డ్రాయింగ్ వేస్తారన్నారు. హారిస్ ఏ విషయాన్నైనా చెత్తగా చెబుతారని విమర్శించారు.

కలుషిత ఆహారంతో
100 మందికి అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

తరచూ ఇలాంటి సంఘటనలు రోజుకొకటి వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా... అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం జామ్‌గూడా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం రాత్రి కలుషిత ఆహారం తిని సుమారు వందమంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది... బాధితులను తొలుత కిల్లోగూడ ఆసుపత్రికి... అక్కడి నుంచి అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ రోజు రాత్రి భోజనం చేసిన వెంటనే 61 మంది విద్యార్థులు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలకు గురికావడంతో పాఠశాల సిబ్బంది వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్నం భోజనంలో బంగాళదుంప, బతానీ కూర వడ్డించారు. ఉడికిఉడకని అన్నం కొంతమంది తినగా మిగిలిన అన్నం వేడి చేసి రాత్రికి విద్యార్థులకు పెట్టినట్లు తెలుస్తుంది. దీంతో రాత్రిపూట అన్నం తిన్న వెంటనే అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక డుంబ్రిగూడ, కిల్లోగూడ వైద్య సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది హుటాహుటిన

పాఠశాలకు చేరుకొని అరకులోయ ప్రాంతీయ హాస్పిటల్‌కి తరలించి వైద్య సేవలు అందించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆందోళనగా శనివారం పాఠశాలకు చేరుకున్నారు. ఒకేసారి 100 మందికిపైగా కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురవడంతో భయాందోళనకు గురైన కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను స్వగ్రామాలకు తీసుకుపోయారు. అధికారులు వీరికి భరోసా ఇచ్చినా వినలేదు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నేతలు, రాజకీయపార్టీల నాయకులు, గిరిజనులు కోరుతున్నారు.

మరింత అప్రమత్తం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చు అని చెప్పారు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని, వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. వర్షాలు, వరదల కారణంగా తాగునీరు, ఆహారం కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ ఉందని, వాటిపై పరిశీలించాలని చెప్పారు. అల్లూరి జిల్లాలో కలుషిత ఆహారం ఘటన జరిగిందని, వాటిపై అధికారులు సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించాలని, బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలన్నారు. కలుషిత ఆహారం ఘటనలకు గల కారణాలపై విచారించి చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల తీవ్రత దృష్ట్యా మరింత సమర్థవంతంగా పనిచేయాలని వైద్య శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ఏజెన్సీలలో జ్వరాలు బారిన పడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, వాగులు దాటేందుకు ప్రజలను అనుమతించవద్దని, ఈ విషయంలో కఠినంగా ఉండాలని చెప్పారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివిధ శాఖల అధికారులు నిత్యం సంప్రదింపులు జరుపుకుని సమన్వయంతో పనిచేయాలన్నారు. విపత్తుల యాజమాన్య శాఖ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారం ఇవ్వాలని, భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు అప్రమత్త సందేశాలు పంపాలన్నారు. విపత్తు వచ్చినప్పుడు ప్రభుత్వం తమను ఆదుకుంటుందనే నమ్మకం వారికి కల్పించేలా అధికారుల, ప్రజా ప్రజాప్రతినిధుల స్పందన ఉండాలని ఆదేశించారు. జలవనరుల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు విడుదలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, అధికారులు బాధ్యతగా ఉండాలన్నారు. పెన్షన్ల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులకు వెసులుబాటు ఇచ్చామని, ఆదివారం సెలవుతో ఒక రోజు ముందుగా శనివారమే పెన్షన్ల పంపిణీకి ఆదేశించామన్నారు. భారీ వర్షాల కారణంగా పింఛన్ల పంపిణీకి సమయం పెంచామని, వచ్చే రెండు మూడు రోజుల్లో సచివాలయ ఉద్యోగులు పెన్షన్లు పంపిణీ చేయవచ్చని తెలిపారు. వర్షాలు లేని ప్రాంతాల్లో యథాతథంగా పెన్షన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

భారీ వర్షాలకు విజయవాడలోని మొగల్రాజపురంలో ఇళ్లపై కొండచరియలు విరిగిపడి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల పరిహారాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందడంపై సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మేఘన, బోలెం లక్ష్మి, లాలు, అన్నపూర్ణ అనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలపై అధికారులతో సీఎం మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న చోట నుంచి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశంపై కసరత్తు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రెండు మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గాడితప్పిన విద్యా వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

వెలుగు చూశాయి. ఏలూరుజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రుల పాలైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందించలేదని రాజకీయ పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. తాజాగా కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల అనుబంధిత విద్యార్థినుల హాస్టల్ బాత్‌రూముల్లో రహస్య కెమెరాలు బిగించిన సంఘటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉలికిపాటుకు గురవుతున్నారు. ఈ పరిణామాలతో విద్యావ్యవస్థ గాడి తప్పుతుందా... ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందా... అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు అన్న తేడా లేకుండా ఘోర సంఘటనలు పునరావృతమవుతున్నాయి. మహిళల వసతి గృహంలో 'హిడెన్' కెమెరాలతో అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఏకంగా బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాలు ఉన్నట్లు విద్యార్థినులు గుర్తించగా, వాటిని కప్పిపుచ్చే ప్రయత్నాలు కొనసాగడంతో విద్యార్థినులు ఆందోళనబాట పట్టారు. ఈ ఘటనతో అన్ని కళాశాలల విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థుల మరణాలు వెలుగు చూస్తున్నప్పటికీ, నియంత్రించడంలో ప్రభుత్వం వైఫల్యమైందని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు తూర్పారబడుతున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థల ఒత్తిళ్లతో మొక్కుబడిగానే కేసులు నమోదువుతున్నాయని విద్యార్థులు మండిపడుతున్నారు.

దండిగా ఫీజులు దండుకుంటున్న కళాశాలలు

ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐసీటీఈ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. తమకు అనుకూల ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు... యాజమాన్యం సంప్రదింపులు జరిపి ఫీజులను దండిగా పెంచుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 215 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం కొన్ని కళాశాలలకు మాత్రమే కన్వీనర్ కోటా ఫీజుల పెంపునకు అనుమతించారు. ఏపీ ఈఏపీసెట్ ద్వారా ఈ విద్యా సంవత్సరం 1,24,491 ఇంజినీరింగ్ సీట్లను భర్తీ చేయగా, ఇంకా 23,155 సీట్లు మిగిలిపోయాయి. మూడు విడతలుగా వెబ్ కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ...సీట్లు మిగిలిపోవడానికి గల కారణాలపై అనేక వాదనలున్నాయి. అధికశాతం ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాథమిక సౌకర్యాలతోపాటు విద్యాబోధన సరిగ్గా లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో విద్యార్థినుల భద్రతా ముడిపడి ఉంది. గత ప్రభుత్వ హయాంలో దిశ యాప్ లాంటిది ప్రవేశపెట్టగా, విద్యార్థినులకు, మహిళలకు ఎంతో ఉపయోగపడిందని చెబుతున్నారు. ఇప్పటి ప్రభుత్వం దానిని తొలగించి, అలాంటి తరహాగా మరొకటి తీసుకురాలేదు. ర్యాగింగ్ నివారణకు సరైన చర్యలూ తీసుకోలేదు. తల్లిదండ్రుల సమావేశాలూ నిర్వహించడం లేదు. దానికితోడుగా ఏఐసీటీఈ నిబంధనలను పాటించకుండా విచ్చలవిడిగా విద్యా కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాల్లో రాష్ట్ర సాంకేతిక శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం, ఫిర్యాదులు వచ్చినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో వదిలేయడంతోనే ఈ తరహా సంఘటనలకు ఆస్కారమేర్పడుతోంది. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి... విద్యార్థుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలని కోరుతున్నారు.

వరుస ఘటనలు...

నెల్లూరు జిల్లా నారాయణ మెడికల్ కళాశాలలో డెంటల్ రెండో సంవత్సర చదువుతున్న విద్యార్థి ర్యాగింగ్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారంచేసి, ఆ తర్వాత హత్య చేసి శవం కూడా కనిపించ కుండా మాయం చేశారు. హత్యారోపణలు ఎదుర్కొంటున్న ఓ యుకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బీసీ హాస్టల్ విద్యార్థి తేజ్ మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ బారిన పడి బీటెక్ (మెకానికల్) రెండో ఏడాది చదువుతున్న ప్రవీణ్‌కుమార్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి డ్రెస్‌తో రాలేదన్న నెపంతో ఫిజిక్స్ లెక్చరర్ 100 గుంజీలు తీయించడంతో ఆ విద్యార్థి ఆస్పత్రిపాలయ్యాడు. తిరుపతి జిల్లా నాయుడుపేట బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తిరుపతి జిల్లా సోక్రేట్ హైస్కూల్‌లో అగ్నిప్రమాదం జరిగి విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా ఏలూరు ఏలేశ్వరం గురుకుల వసతి గృహంలో 75 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురపట్ల మండలం కైలాస పట్టణం అనాధ వసతి గృహంలో విషఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, 35 మంది ఆస్పత్రిలో చేరారు. అనకాపల్లి జిల్లాలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ వేధింపులతో ఓ విద్యార్థిని అత్మహత్యాయత్నం చేసుకుంది. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో కలుషిత ఆహారంతిని దాదాపు 1000 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. అల్లూరిజిల్లా డంబ్రిగూడ మండలం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.

సంక్షోభంలో ఎన్డీయే ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

మోదీ మాట తప్పారన్నారు. అన్ని రకాలుగా దేశంలో సంక్షోభం వచ్చిందన్నారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సీపీఐ అధ్వర్యంలో దేశవ్యాప్తంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి ఆందోళన చేయనున్నట్లు నారాయణ చెప్పారు. చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ మద్దతు ఇవ్వకపోతే నరేంద్రమోదీ ప్రధాని అయ్యేవారు కాదన్నారు. బంగ్లాదేశ్‌లో హసీనా నాలుగవ సారి ప్రధాని అయ్యారని, అయితే ఆమె నియంతృత్వ పోకడలతో ప్రజలు తిరుగుబాటు చేయడంతో దేశం విడిచి పారిపోయారన్నారు. పశ్చిమబెంగాల్‌లో మమత బెనర్జీ బలంగా ఉన్నప్పటికీ... ఇటీవల వైద్య విద్యార్థిని హత్యాచారంతో ఆమె ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందన్నారు. బంగ్లాదేశ్ ఉద్యమ ప్రభావం పశ్చిమ బెంగాల్‌పై పడిందని నారాయణ అభిప్రాయపడ్డారు. ఇదే ప్రభావం నరేంద్రమోదీపైనా పడుతుందని ఆయన అన్నారు. మోదీని దింపాలని ఆయన సొంత పార్టీ నేతలే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమన్నారు. మోదీని పదవి నుంచి దింపకుండా చేయడానికి కొంతమంది చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని నారాయణ చెప్పారు. అయితే ఈ విషయంలో తల దూర్చితే ఇబ్బందులు వస్తాయనే అనుమానంతో చంద్రబాబు మిన్నకుండి పోయారన్నారు. దీనిని బట్టి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయినట్లు కనిపిస్తోందని, మోదీ మెడపై అసంతృప్తి కత్తి వేలాడుతోందన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై అత్యాచారాలు పెరిగి పోయాయని, ఇందుకు పాలకులే బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బీహార్, మహారాష్ట్రలో జరిగిన సంఘటనలను ఉదహరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే అత్యాచారాలను దాచి పెడుతున్నారని, ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో జరిగితే భూతద్దంలో చూపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రులపై నామినేటెడ్ గవర్నర్లు సవారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు దిల్లీలో కేజ్రీవాల్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఘటనలను నారాయణ ఉదహరించారు. తమిళనాడు, కేరళలోనూ బీజేపీ ప్రభుత్వం ఇలానే చేస్తోందన్నారు. ఇలా చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని నారాయణ అభిప్రాయపడ్డారు. మతాల మధ్య విభేదాలు సృష్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ముంబై సినీనటి కాదంబరి జెత్వానీని వేధించిన పోలీసు అధికారులను, నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపించి... బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండు చేశారు. అమ్మాయిల జీవితాలతో చెలగాటం ఆడటం మంచిది కాదన్నారు. ఇటీవల కాలంలో యాప్‌ల పేరుతో పేదలకు రుణాలు ఇస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఇలా వేధించే వారిని ఇళ్లకు వస్తే కట్టేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ నేతలు అండగా నిలుస్తారన్నారు. యాప్ రుణాల పేరుతో పేదలను వేధిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమన్నారు. హైదరాబాదులో హైడ్రా పేరుతో ఆక్రమణలు తొలగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలను నారాయణ సమర్థించారు. ఏపీలో చంద్రబాబునాయుడు కూడా అలానే చేయాలన్నారు. రేవంత్ రెడ్డికి ఉన్న ధైర్యంలో 50 శాతం చంద్రబాబుకు ఉన్నా అలా చేసేవాడన్నారు. వైసీపీ హయాంలో ఎన్నో భూ కబ్జాలు జరిగాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి చంద్రబాబు ధైర్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉండకూడదన్నారు. న్యాయం కోసం చంద్రబాబు గట్టిగా నిలబడాలని నారాయణ సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ వర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీ రంగరాజన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

బస్సుల్లో సొంతూళ్లకు పంపేందుకు కాలేజీ యాజమాన్యం చేసిన ప్రయత్నాన్ని విద్యార్థి నేతలు అడ్డుకున్నారు. బస్సుకు అడ్డుగా పండుకున్నారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి నిరసనలు చేపట్టిన విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, జిల్లా కన్వీనర్ సాదిక్ నేతృత్వంలో ఏఐఎస్ఎఫ్ శ్రేణులు మద్దతు తెలిపాయి. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం విద్యార్థులను బలవంతంగా బస్సులలో ఇంటికి పంపించడానికి ప్రయత్నించడంతో ఏఐఎస్ఎఫ్ నేతలు బస్సుకు ఎదురుగా వర్షంలో కింద పడుకుని అడ్డుకున్నారు. వెంటనే కళాశాల యాజమాన్యం పోలీసులతో ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేయించింది. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంచదారల దుర్గాంబ కళాశాల వద్దకు వచ్చి అక్రమంగా అరెస్టు చేసిన సాయికుమార్, సాదిక్‌ను విడుదల చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్లవల్లేరు కళాశాల ఘటన నిందితులను తప్పించాలని యాజమాన్యం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎప్పుడూ కళాశాలకు సెలవులు ఇవ్వని యాజమాన్యం నాలుగు రోజులు సెలవులు ప్రకటించడం, విద్యార్థులు తమకు న్యాయం జరిగేంతవరకు ఇంటికి వెళ్లేది లేదని ఆందోళన చేపట్టినా పోలీసుల సహకారంతో బస్సులలో బలవంతంగా తరలించడం ఏమిటని ప్రశ్నించారు. 300 వీడియోలు నిందితుల దగ్గర ఉన్నాయని కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తే వారు సరిగా స్పందించకపోవడం వల్లే విద్యార్థినులు ఆందోళనకు దిగారని తెలిపారు. బీటెక్ ఫైనలియర్ విద్యార్థిని సాయంతో నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు చెబుతున్నప్పటికీ, కళాశాల వాష్ రూమ్‌ల్లో కెమెరాలు ఏమీలేవంటూ జిల్లా ఎస్పీ ప్రకటన చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రత్నకుమారి, సభ్యులు కుమారి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులను ఖండించిన ఎస్ఎఫ్ఐ

ఏఐఎస్ఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం ఖండించారు. హాస్టల్ విద్యార్థినులను బలవంతంగా ఖాళీ చేయించి అక్రమంగా బస్సుల్లో తరలిస్తుండగా అడ్డుకోవడంతో అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎమ్.సాయికుమార్, సాదిక్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'గుడ్లవల్లేరు'పై దర్యాప్తు సజావుగా సాగుతుందా?

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ దర్యాప్తు సజావుగా సాగుతుందా అనే సందేహం సర్వత్రా నెలకొంది. విద్యార్థినులు అలుపెరగకుండా నిరసన చేస్తున్నప్పటికీ, కళాశాల యాజమాన్యం మాత్రం ఈ వ్యవహారంలో అనుసరిస్తున్న విధానాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనకు ప్రధాన కారణంగా ఉన్న విద్యార్థిని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కళాశాల హాస్టల్ నుంచి కారులో పంపించేందుకు విశ్వప్రయత్నం చేశారు. అసలు అ విద్యార్థినిని ఎందుకు ఇంటికి పంపించాలని ప్రయత్నించారని కొంత మంది విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలలో రహస్య కెమెరాల ఘటన వెనుక ఉన్నది అదే కళాశాలకు చెందిన ఒక విద్యార్థినిని కావడం సంచలనంగా మారింది. ఆమె బాయ్ ఫ్రెండ్, మరికొందరు విద్యార్థులు కలిసి నిందితురాలిని బెదిరించడంతో ఇంతటి దారుణానికి ఒడిగట్టిందని, కళాశాలలో ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం సదరు విద్యార్థినిని గుట్టుచప్పుడు కాకుండా కళాశాల నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. పైగా ఇంతటి తప్పు చేసినప్పటికీ సదరు విద్యార్థినిలో ఎలాంటి బెరుకు, భయం లేకుండా మిగిలిన విద్యార్థినులను బెదిరిస్తుందని విద్యార్థులు తెలిపారు. మిగిలిన విద్యార్థినులు ఆమెపై దాడి చేయడానికి యత్నించగా సదరు యువతి మిడిల్ ఫింగర్ చూపించడం గమనార్హం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతుంది. ఈ విషయంలో కళాశాల యాజమన్యం తమపై కక్ష పెంచుకుని సర్టిఫికెట్లు, మార్కుల విషయంలో కూడా ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందేమోనని ఆందోళన చేపట్టిన విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ తల్లిదండ్రులు ఆందోళన చెందిన హాస్టల్‌ను నుంచి ఇంటికి వచ్చేయాలని వత్తిడి చేస్తున్నారని కొంతమంది విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు.

కుండపోత

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు ఆదేశించారు. కాకినాడలోని యాంకరేజ్ పోర్టు నుంచి రెండు రోజులపాటు బియ్యం ఎగుమతులు నిలిపివేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను వాతావరణశాఖ జారీజేసింది. అనకాపల్లి, విశాఖ, కాకినాడ, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ ఎలర్ట్‌ను విధించింది. భారీ వర్షాలతో విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందారు. గుంటూరు జిల్లాలో వాగులో కారు కొట్టుకుపోయి ఉపాధ్యాయుడితోపాటు అతని ఇద్దరు పిల్లలు మరణించిన సంఘటన తీవ్ర విషాదం నింపింది. విజయవాడలోని అన్ని రహదారులు నదులను మరిపించాయి. వన్‌టౌన్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలు, వరదలపై సీఎం చంద్రబాబు సమీక్షించి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. భారీ వర్షాల ప్రభావిత జిల్లాలైన కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల విద్యాసంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించారు. ఎవరూ బయటకు రావద్దని ఆదేశాలు జారీజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో, ముంపు ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

విజయవాడను ముంచెత్తిన భారీ వర్షం

ఎన్టీఆర్‌జిల్లా మైలవరం నియోజకవర్గంలోనూ రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు మండలాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం-కేశ్వాతండా మధ్య వాగులో వరద ఉధృతి పెరిగి... రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలతో జలాశయాలకు వరద నీరు వచ్చిచేరుతోంది. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. మైలవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జగ్గయ్యపేట ప్రాంతంలో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. పల్నాడు జిల్లా నరసరావుపేట పరిసర ప్రాంతల్లో జోరుగా వర్షం కురిసింది. జి.కొండూరు మండలం ఎంఈవీ కార్యాలయంలోకి వర్షపు నీరు రావడంతో రికార్డులు, ఎస్ఆర్‌లను సిబ్బంది బయటకు తరలించి భద్రపరిచారు. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షంతో విజయవాడ అస్తవ్యస్తంగా మారిపోయింది. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, సుందరయ్యనగర్, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల రహదారులు వర్షపు నీటితో మునిగిపోయాయి. కండ్రిక, పాతపాడులోని రోడ్లు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా విజయవాడ రామవరప్పాడు రింగ్‌రోడ్డు దగ్గర భారీగా ట్రాఫిక్ స్తంభించింది. బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ దగ్గర భారీగా వర్షపు నీరు నిలిచింది. దుర్గగుడి ఫ్లైఓవర్‌ను తాత్కాలికంగా మూసివేశారు. లోబ్రిడ్జి దగ్గర నడుం లోతులో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో అక్కడ మూడు బస్సులు, లారీ చిక్కుకుపోయింది. అటు.. మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్ సమీపాన కొండచరియలు విరిగిపడిన ఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఈ సంఘటనలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో భారీ వర్షం కారణంగా రహదారులపైకి నీరు వచ్చి చేరింది. ఇదే జిల్లాలోని ఆరుగొలను గ్రామంలో వరి నాట్లు వేసిన పంట పొలాలన్నీ నీట మునిగాయి. హనుమాన్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నీరు పొంగి ప్రవహించింది.

గుంటూరు జిల్లాలో వాగులోకి కొట్టుకుపోయిన కారు

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. మంగళగిరి, తెనాలి, పొన్నూరు, ఆటోనగర్, పెదకాకాని తదితర లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని వాగులోకి కారు కొట్టుకుపోయి ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, అతని పిల్లలు సాత్విక్, మానిక్ దుర్మరణం చెందారు. గుంటూరులోని ఆర్టీసీనగర్, తారకరామానగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. రోడ్లు చెరువులను తలపించాయి. గుంటూరు, తుళ్లూరు మధ్య ఉన్న పొట్టేలు వాగు పొంగిపొర్లడంతో ఆ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీజేశారు. మంగళగిరి టోల్ ప్లాజా దగ్గర జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో నదిలా తలపించింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలోనూ వర్షం ముంచెత్తడంతో స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పటిష్ఠ చర్యలు: అనగాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావొద్దు అని సూచించారు. జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడకుండా అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడిన చోట్ల తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలన్నారు. కొన్ని చోట్ల విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని, వర్షాలకు చెరువులు నిండుతాయని ... అలాంటి చోట్ల నీటిపారుదల శాఖ అధికారులు వాటిని నిత్యం పర్యవేక్షించాలన్నారు. పెన్షన్ పంపిణీ సమయంలో ప్రమాదాలకు గురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లినవారు జాగ్రత్తగా తీరం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై కఠినచర్యలు

అహ్మద్‌బేగ్ విజ్ఞప్తి

విజయవాడ: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్‌లోని వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాల ఘటన ఆందోళన కలిగిస్తోందని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం లోతుగా విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఓ ప్రకటనలో కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. విద్యార్థినుల్లో మానసిక స్థైర్యం నింపాలంటే... ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి ఉందని, దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టకూడదని జమీల్ అహ్మద్ బేగ్ సూచించారు.

జగన్ బాటలోనే చంద్రబాబు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్య,విద్యా సంస్థలకు ఎన్టీఆర్ పేరును మాజీ సీఎం జగన్ అనాడు తొలగించి పెద్ద తప్పు చేస్తే... ఇప్పుడు అదే బాటలో సీఎం చంద్రబాబు నడుస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల మండిపడ్డారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలకు, ఆసుపత్రులకు వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు తొలగించడాన్ని ఆమె 'ఎక్స్' వేదికగా శనివారం ఖండించారు. ఇది ప్రతీకార చర్యగా కాంగ్రెస్ భావిస్తోందన్నారు. ఎన్టీఆర్ అయినా, వైఎస్ఆర్ అయినా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి పాటుపడిన వాళ్లేనని, పాలనలో తమదైన ముద్ర వేసిన వాళ్లేనని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఇద్దరిని చూడాలి తప్పితే నీచ రాజకీయాలు ఆపాదించడం సమంజసం కాదన్నారు. వైఎస్ఆర్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, రుణమాఫీ, ఉచిత కరెంట్, పెన్షన్లు, ఇలా ప్రతి పథకం దేశానికే ఆదర్శనీయమని ఆమె పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఏదొక పార్టీకి సొంతం కాదని, తెలుగు వారి ఆస్తి అని అన్నారు. తెలుగు వారి గుండెల్లో ఆయన స్థానం ఈనాటికీ పదిలమని తెలిపారు. వైసీపీ మీద ఉన్న కోపాన్ని వైఎస్ రాజశేఖర రెడ్డిపై రుద్దడం సరికాదన్నారు. వైసీపీలో వైఎస్ఆర్ లేరని, అది వైవీ, సజ్జల, సాయిరెడ్డి పార్టీ అని ఆమె ఎద్దేవా చేశారు.

రేపు కూడా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాల కారణంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాస్తవంగా సెప్టెంబరు 1వ తేదీన పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా... ఆ రోజు ఆదివారం వచ్చింది. దీంతో ఒక రోజు ముందుగా అంటే... శనివారం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెల్లవారు జాము నుంచి జోరు వర్షంలోను సచివాలయాల ఉద్యోగులు ఇంటింటా పెన్షన్లు పంపిణీ చేశారు. భారీ వర్షాల ప్రభావిత జిల్లాల్లో సెప్టెంబరు 2వ తేదీన పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 64,61,485 లబ్ధిదారులకు రూ. 2729. 86 కోట్లను కూటమి సర్కార్ పంపిణీ చేయాల్సి ఉంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అధ్వర్యంలో సాయంత్రానికి 93. 19 శాతానికి పైగా పంపిణీ జరిగింది. వర్షాలు లేని ప్రాంతాల్లో యథాతథంగా ఒక్క రోజులోనే ఉద్యోగులు పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాల్సి ఉంది. పెన్షన్ల పంపిణీలో ఉద్యోగులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. మచిలీపట్నం ధర్మాసాగరంలో వృద్ధులకు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పెన్షన్లు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం జియ్యన్న వలసలో ఇంటింటికీ వెళ్లి ఫించన్‌దారులకు మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు తదితరులు పంపిణీ చేశారు.

గ్రామసభల్లోనే గుర్తింపు కార్డులు

రైతు, కౌలు రైతుల సంఘాల నేతల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): గ్రామసభల్లోనే నేరుగా కౌలురైతులను గుర్తించి... భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండానే గుర్తింపు కార్డులు జారీచేసేలా నూతన కౌలు చట్టం తేవాలని రైతు, కౌలు రైతు సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు వస్తే వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పంట పొలాలు పరిశీలించి చుట్టుపక్కల రైతులను విచారించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే నిబంధన పొందుపర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్వర్యంలో కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం సమగ్ర కౌలుచట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ శనివారం చర్చాగోష్ఠి కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కాటమయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తీర్మానం ప్రవేశ పెడుతూ కౌలురైతుల రక్షణ, సంక్షేమం కోసం సమగ్రమైన కౌలుచట్టం తీసుకురావాలని, కౌలురైతుల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేందుకు ఎటువంటి ఆటంకాలు, ఆంక్షలు లేని కౌలు వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతుల సంక్షేమం కోసం నూతన కౌలుచట్టం తీసుకొస్తానని ప్రకటించిందని, ఈ చట్టం తెచ్చేముందు క్షేత్రస్థాయిలో కౌలు రైతులతోను, రైతు, కౌలురైతుల సంఘాల ప్రతినిధులతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. చట్ట తీసుకురావడమే కాకుండా చిత్తశుద్ధితో, దృఢసంకల్పంతో అమలు జరిపే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులను గుర్తించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారిని గుర్తించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న అన్ని రకాల పంటల విత్తనాలు, పచ్చి రొట్ట విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సూక్ష్మ పోషకాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాలన్నారు. గుర్తింపు కార్డులు పొందిన భూమిలేని ప్రతి కౌలు రైతుకు కులంతో సంబంధం లేకుండా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని వర్తింపజేసి... రూ. 20 వేలను పెట్టుబడి సాయం కింద అందించాలని కోరారు. రైతు స్వరాజ్ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు విసా కిరణ్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారానే కౌలు రైతులను గుర్తించే విధంగా చట్టం రూపకల్పన జరగాలని కోరారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలురైతులకు భూ యజమాని తీసుకున్న రుణాలతో సంబంధం లేకుండానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి సొంత పూచీకత్తుతో వడ్డీలేని పంట రుణాలు అందించినప్పుడే కౌలురైతులకు రక్షణ ఉంటుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కౌలురైతులు పండిస్తున్న అన్ని పంటలకు ఉచిత పంటల బీమా పథకం వర్తింప చేయాలని, గుర్తింపు కార్డుల ఆధారంగా పంటలను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ సొసైటీ భూములు, లంక భూములు, నది పరివాహక ప్రాంత భూములను తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న గ్రామీణ పేదలను గుర్తించి వారికి సాగు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సీహెచ్ కేశవ్ శెట్టి మాట్లాడుతూ దేవాదాయ, ధర్మాదాయ, వివిధ ట్రస్టుల భూములను, వక్ఫ్ భూములను సాగు చేసుకుంటున్న కౌలురైతుల కౌలు ఒప్పందం ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.బాలు, తెలంగాణ రైతు స్వరాజ్య వేదిక కార్యదర్శి బి.కొండలు, కౌలురైతుల సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.తిమ్మయ్య, కౌలు రైతుల సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు తదితరులు మాట్లాడారు.

విశాఖ పోర్టుకు ప్రశంసలు

నదుల సంరక్షణ, పునరుద్ధరణపై రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీ... నదుల సంరక్షణ, పునరుద్ధరణ పిటిషన్‌పై విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో శనివారం రాజ్యసభ సభ్యుడు సుజీత్ సింగ్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఏపీ అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మినిస్ట్రీ ఆఫ్ పోర్ట్స్, షిప్పింగ్, వాటర్వేస్, మినిస్ట్రీ ఆఫ్ స్టీల్, మినిస్ట్రీ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్‌మెంట్, గంగా నది పునరుద్ధరణ వంటి ప్రధాన సంస్థలు హాజరయ్యాయి. విశాఖ పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పోర్ట్ కార్యకలాపాలు... సాధించిన విజయాలను కమిటీకి వివరించారు. ప్రపంచ బ్యాంక్, సీపీపీఐ... 2023లో విశాఖపట్నం పోర్ట్‌కు 19వ ర్యాంక్ కేటాయించింది. ఈ ర్యాంక్‌ను ఏ ప్రాతిపదికన ఇస్తారో అనే విషయాన్ని కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘనతను సాధించిన పోర్ట్ యాజమాన్యాన్ని కమిటీ ప్రశంసించింది. అన్ని సంస్థల ప్రతినిధులతో కమిటీ చర్చించింది. విశాఖ పోర్ట్ చేపట్టిన మిలియన్ మొక్కల పంపిణీని కమిటీ అభినందించింది. పెంపకం వాటి పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలతో పాటు సామాజిక బాధ్యత కింద పోర్ట్ చేపడుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి అనేక పనులు నిర్వహించినట్లు పోర్ట్ చైర్మన్ వెల్లడించారు. ఇప్పటివరకు రూ.75 కోట్లు వెచ్చించినట్లు కమిటీకి వివరించారు.

రేపు ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాలను అందిస్తోన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నాలుగవ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సెప్టెంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ఆవరణలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆక్సిల్లర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్ పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాల క్రిష్ణన్, గౌరవ అతిథిగా ప్రఖ్యాత స్విగ్గీ ఫుడ్ మార్కెట్ సీఈవో రోహిత్ కపూర్ విచ్చేస్తారు. వారితో పాటు యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టి.ఆర్.పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్ కుమార్ హాజరవుతారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ మొత్తం 1,018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారు. ప్రతిభ చూపిన 28 మంది బంగారు, వెండి, కాంస్య పతకాలను అందుకోనున్నారు. 24 మంది పీహెచ్ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజినీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ, 29 మంది బీబీఏ, ముగ్గురు బీకామ్ చదువులు పూర్తి చేసుకుని డిగ్రీలు అందుకోనున్నారు. వారితో పాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి కేంద్రంగా 2017 జులైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రారంభమైంది. ప్రస్తుతం 9 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, సైన్స్, లిబరల్ ఆర్ట్స్ అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. మరో 350 మంది పీహెచ్ విద్యార్థులు ఉన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యాపరంగా ఎంతో అభివృద్ధిని సాధించి, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రైవేట్ యూనివర్సిటీగా పేరు గడించింది. ప్రతి ఏటా 80 శాతం విద్యార్థులు వివిధ పేరున్న కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఎంపికవుతున్నారు. మిగతా వారంతా ఉన్నత చదువుల నిమిత్తం విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందుతున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అధ్వర్యంలో డీన్‌లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్ సింగ్, పంకజ్, అనిల్ నిగమ్, ఫెర్నాండెజ్, రేవతి స్నాతకోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: కృష్ణా పరివాహ ప్రాంతంలో వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుండి భారీగా వచ్చి శ్రీశైలం జలాశయానికి నీరు చేరుతోంది. దీంతో జలాశయం నుండి 10 స్పిల్‌వే గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ సాగర్‌కు 2,52,675 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తి పోతల పథకం-24 వేలు, ఎగువ జూరాల, సుంకేసుల నుండి జలాశయానికి 3,24,525 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో దిగువ పోతిరెడ్డి పాడుకు 30 వేలు, హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1688, ఏపీ జలవిద్యుత్‌కు 30,520, క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కు 37,882 క్యూసెక్కు ల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం నుండి ఔట్‌ఫ్లో 3,49,152 క్యూసెక్కులు ఉంది. జలాశయం పూర్తి నీటీ మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 885 అడుగుల నీరు ఉంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 215.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉన్నత విద్యా మండలి ప్రక్షాళన

ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా మండలి అధికారులుగా కొనసాగుతూ విద్యార్థి, ఉద్యోగుల వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ఇన్‌ఛార్జి చైర్మన్ కె.రామ్‌మోహన్‌రావు, కార్యదర్శి నజీర్ అహ్మద్‌ని తక్షణమే తొలగించాలని, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... కొంతమంది అధికారులతో కలిసి వీరు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ మద్దతుదారులకు అనుకూలంగా వ్యవహరించిన హేమచంద్రారెడ్డి వల్ల ఇప్పుడు అవార్డుల ప్రక్రియ గాడి తప్పిందన్నారు. వారు ఇప్పటికీ హేమచంద్రారెడ్డి అనుచరులకు మద్దతునిస్తూనే ఉన్నారని, సహాయ ఆచార్యునికి అనుకూలంగా ఆచార్యులను పక్కన పెడతారని, ఆధిపత్య విజ్ఞానాన్ని పరిగణించటం లేదని తెలిపారు. నకిలీ డేటా... ఎప్పుగూ విధుల నుంచి తప్పించుకునే వారికి ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వైసీపీకి పనిచేసే గట్టి మద్దతుదారులైన సహాయ ఆచార్యులకు అనుకూలంగా కృష్ణా విశ్వవిద్యాలయ ఆచార్యులను పక్కన పెట్టారని గుర్తుచేశారు. రామశేఖర్ రెడ్డి వైసీపీకి గట్టి మద్దతు దారుడు అని, హేమచంద్రారెడ్డి ముఖ్య అనుచరులలో ఒకరని, అతడు బోధన పని నుంచి తప్పించుకుంటాడని వివరించారు. అతడు పీహెచ్‌డీని గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెచ్చుకున్నారని, అతడికి ఆధిపత్య పరిజ్ఞానం లేదని పేర్కొన్నారు. కేయూలో అతడి ఎంపిక విధానమే సరికాదన్నారు. ఇప్పుడు హేమచంద్రారెడ్డికి బలమైన మద్దతుదారులుగా ఉన్న ప్రస్తుత వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు, ప్రస్తుత రిజిస్ట్రార్ కృష్ణా విశ్వవిద్యాలయం అధ్వర్యంలో హేమచంద్రారెడ్డిని ఆహ్వానించడం ద్వారా పరిశీలనలో అధ్యాపక పేర్లను తారుమారు చేసి అతడికి అనుకూలమైన అధ్యాపకులకు రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డును ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. దీనిపై ప్రభుత్వం స్పందించి కొత్తవారిని నియమించి పారదర్శకంగా అవార్డులు అందజేయాలని సుబ్బారావు డిమాండ్ చేశారు.

బాధితులను ఆదుకోండి: సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలు, రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వర రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పల్లపు ప్రాంతాల్లో జనవాసాలు, పంట పొలాలు నీట మునిగాయని, తక్షణమే తగు సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని కోరారు. భారీ వర్షంలోనూ ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం మండలాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాగులు, కాలువలు, చెరువులు పొంగిపొర్లడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మెట్ట, వరి పంటలన్నీ చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. కొండపల్లి మున్సిపల్ అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారని కోటేశ్వరరావు తెలిపారు. కనిమెర్ల చెరువు, చంద్రాల చెరువు మైలవరం కోట చెరువులు తెగడంతో చెవుటూరు, వెల్వడం చెరువులు నదులను తలపిస్తున్నాయన్నారు. ఏ క్షణంలో నైనా గట్లు తెగి గ్రామాలు... పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉందన్నారు. ఆ ప్రాంత ప్రజలు ప్రమాదంలో చిక్కు కునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంకటాపురం వద్ద కుంటముక్కల మహిళా రెసిడెన్షియల్ పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థినులను చెవుటూరు పాఠశాలకు తరలించాలన్నారు. సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, కన్నా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... ఇబ్రహీంపట్నంలో బుడమేటి కట్ట తెగటంతో ఖాజీ మస్యం నీట మునిగి వేలాది మంది పేదలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయపడుతుండడంతో శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆహార పొట్లాలు అందించారు.

15లోపు వలంటీర్లకు జీతాలు ఇవ్వకుంటే

వీధి పోరాటాలే

గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: సెప్టెంబరు 15వ తేదీలోపు వలంటీర్లకు జీతాలు ఇవ్వకపోతే వీధి పోరాటాలే శరణ్యమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వలంటరీ అసోసియేషన్ (ఏఐవైఎఫ్) అనుబంధ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. అసోసియేషన్ అధ్వర్యంలో శనివారం హనుమాన్‌పేట సీపీఐ కార్యాలయంలో విస్తృత రాష్ట్ర కార్యవర్గం సమావేశం జరిగింది. ముఖ్య అతిథి ఈశ్వరయ్య మాట్లాడుతూ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీ ప్రకారం రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి కొనసాగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని, సచివాలయాల్లో వలంటీర్ల హాజరును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు ఎవరు అధికారంలో ఉన్నా ప్రజలకు సేవ చేసేందుకు వారి వంతు బాధ్యతను నిర్వహిస్తున్నారని, వాళ్లను రాజకీయాల్లోకి తీసుకురావద్దని హితవు పలికారు. సీఎం చంద్రబాబు నాయుడు తక్షణమే బకాయి గౌరవ వేతనాలు ఇవ్వాలని, సెప్టెంబరు 15 తేదీలోపు పరిష్కరించకపోతే అన్ని జిల్లాల వలంటీర్లను సంఘటితం చేసి వీధి పోరాటాలతో ముందుకు వెళతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవిందరాజులు, కార్యదర్శి జంగాల చైతన్య ప్రసంగించారు. వివిధ జిల్లాల నుంచి రాజేష్, సరోజిని, యామిని, వాసు, ప్రియాంక, భవాని, షామిలీ, కె.వెంకటసుబ్బయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వర్ష ప్రమాద ఘటనలపై జగన్ దిగ్భ్రాంతి

ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా జరిగిన ఘటనల్లో అనేక మంది మృతి చెందడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడలో కొండచరియలు విరిగిపడి నలుగురు మరణించడంతో పాటు గుంటూరు జిల్లా ఉప్పలపాడులో వరద ఉధృతికి వాగులో కారు కొట్టుకుపోయిన ఘటనలో టీచర్ సహా ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, మంగళగిరి గండాలయ్యపేటలో కొండ చరియలు విరిగిపడి వృద్ధురాలు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయిందని, విజయవాడ సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఈ ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలన్నారు. బాధితులకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని జగన్ విజ్ఞప్తి చేశారు.

బీసీలు చదువుకోవడం జగన్‌కు ఇష్టం లేదు

టేకులోడు ఎంజేపీ బాలికల స్కూల్‌లో మంత్రి సవిత తనిఖీలు

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: బీసీ విద్యార్థులు చదువుకోవడం జగన్‌కు ఇష్టం లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత విమర్శించారు. తుది దశలో ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్ల భవనాలను అయిదేళ్లలో పూర్తి చేయకుండా గత ప్రభుత్వం విడిచిపెట్టేసిందన్నారు. హిందూపూర్ నియోజవర్గంలోని చిలమత్తూరు మండలం టేకులోడు ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను మంత్రి సవిత శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని గదులను, బాత్‌రూమ్‌లను, వంట గదిని పరిశీలించారు. విద్యార్థినుల కోసం వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. స్టాక్ రూమ్‌లోని బియ్యం బస్తాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను, సిబ్బంది అటెండెన్స్ రిజర్లను తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. మంచి భోజనం పెడుతున్నారా... బాగా చదువు చెబుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తెలియజేయాలని సూచించారు. దీంతో విద్యార్థినులు అనేక సమస్యలు వివరించగా, వాటన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి సవిత భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు విద్యతో పాటు వసతి కూడా అవసరమని భావించిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ వస్తున్నారన్నారు. కొత్త హాస్టళ్లను, సొంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందజేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. విద్యార్థినులు తుది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థినులు కోరినట్లు కాంపౌండ్ వాల్ కూడా నిర్మిస్తామన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మండల కన్వీనర్ రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సందీప్, అశ్వతప్ప, క్రేన్ మల్లికార్జున, బలిజపల్లి అశ్వతప్ప, చంద్రనాయక్, రఫీక్, ఖలీమ్, మీసేవ రాజేష్, గంగాధర్, ఆదిమూర్తి, నాయకులు, కార్యకర్తలు ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయసింహ నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి: షర్మిల

విశాలాంధ్ర-విజయవాడ: భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 8 మంది చనిపోవడం అత్యంత బాధాకరమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణం ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు వర్షాలతో ఇంకా ప్రాణనష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున ఎన్డీఆర్ఎఫ్ బలగాలను, రెస్క్యూ టీమ్‌లను రప్పించి వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు బాధితులకు అండగా నిలవాలన్నారు.

సంపాదకీయం

మోదీ క్షమాపణా రాజకీయమే

"శివాజీ మహారాజ్ నా ఆరాధ్య దైవం. నేను ఈ రోజు తల వంచి నా ఆరాధ్య దైవం ఛత్రపతి శివాజీ పాదాలకు నమస్కరిస్తూ క్షమాపణ వేడుకుంటున్నాను. నేను మహారాష్ట్ర నేల మీద అడుగుపెట్టిన వెంటనే ఛత్రపతి మహారాజ్ పాదాలకు నమస్కరించి క్షమాపణ వేడుకుంటున్నాను". ఈ మాటలు క్షమాపణ అడిగే అలవాటు ఏ మాత్రం లేని ప్రధానమంత్రి మోదీ నోటి నుంచి వెలువడ్డాయి. ఆయన క్షమాపణ వేడుకోవడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం విరిగి నేలమీద పడిపోయింది. ఈ విగ్రహాన్ని నెలకొల్పి ఎన్నో రోజులు కాలేదు. ఆ విగ్రహాన్ని ఆవిష్కరించింది కూడా ప్రధానమంత్రి మోదీనే. విగ్రహం కూలినందుకు మొదట మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ క్షమాపణ చెప్పారు. తరవాత ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే క్షమాపణ వేడుకున్నారు. ఇప్పుడు పాల్గడ్ చేరుకున్న వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పారు. శివాజీ మహారాజ్ మాకు కేవలం మహాపురుషుడే కాదు. ఆరాధ్య దైవం అని అన్నారు. ప్రధానమంత్రి మోదీ క్షమాపణ చెప్పడానికి కారణం ఏమిటి అని ఆలోచించాలి. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు మోదీ మహారాష్ట్ర అంతా చుట్టబెట్టారు. ఆయన ఏ పర్యటన అయినా ఎన్నికలతోనే ముడివడి ఉంటుంది. ఎన్నికలు జరిగే చోట ఆయన ఇంకా ఎన్నికలు ప్రకటించక ముందే ఏదో ఒక మిషతో పర్యటిస్తారు. ఆ రాష్ట్రాలకు బోలెడు వరాలు గుమ్మరిస్తారు. ఎక్కడికి వెళ్లినా మీ రాష్ట్రాన్ని నెంబర్ వన్ రాష్ట్రంగా చేస్తాను అని వాగ్దానాలు ఎడాపెడా విరజిమ్ముతారు. అయినా లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి దక్కింది కేవలం తొమ్మిది సీట్లే. మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ తరవాత ఎక్కువ లోక్‌సభ సీట్లు ఉన్నది మహారాష్ట్రలోనే. కొద్ది నెలల కింద మోదీ మహారాష్ట్రలో పర్యటించిన సందర్భంలోనే శివాజీ విగ్రహాన్నీ ఆవిష్కరించారు. విగ్రహాలు నేలకొరగడంలో విచిత్రం లేదు. అసలు వాటిని నెలకొల్పాలన్న ఆలోచన మొదలైనప్పటి నుంచీ అవినీతి ప్రారంభం అవుతుంది. తయారీలో నాణ్యత లోపించవచ్చు. అసలు నెలకొల్పడంలోనే తేడాలు ఉండొచ్చు. అన్ని దశల్లోనూ అవినీతి కొనసాగుతున్నప్పుడు కొన్ని నెలల కాలంలోనే శివాజీ విగ్రహం కూలడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఈ విగ్రహాన్ని హడావుడిగా నెలకొల్పారు. విగ్రహం నేలకూలి ముక్కముక్కలై పోయింది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించి, నెలకొల్పిన శివాజీ విగ్రహం నేలకూలడం ఇదే మొదటిసారి. మహారాష్ట్ర ప్రజలు శివాజీని గొప్ప యోధుడిగా భావిస్తారు. ఆరాధిస్తారు. హిందుత్వ వాదులు శివాజీని తమ చిహ్నంగా మలుచుకున్నారు. విగ్రహం కూలడం మహారాష్ట్ర ప్రజల మనోభావాలను గాయపరచడంలో ఆశ్చర్యం లేదు. శివాజీ మహారాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవానికి సంకేతం. కూలిన విగ్రహం కంచుతో తయారు చేసింది. విగ్రహం కూలిన వెంటనే జనాగ్రహం కట్టలు తెంచుకుంది. విగ్రహం కూలిన వెంటనే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇందులో ప్రభుత్వ పాత్ర ఏమీ లేదని చేతులెత్తేశారు. దేశమంతటా ఆగ్రహ జ్వాలలు చెలరేగడంతో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేను మహారాష్ట్ర ప్రజలను క్షమించమని వేడుకుంటున్నాను అన్నారు. విగ్రహాలను నెలకొల్పడం ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖకు తెలియకుండా జరగదు. ఆ మంత్రిత్వశాఖ ఇంతకు ముందు ఈ విగ్రహం ఆరడుగులని చెప్పింది. తీరా నెలకొల్పిన విగ్రహం 35 అడుగులది. విగ్రహం ఎత్తులో ఇంత తేడా ఉన్నప్పుడు మహారాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ చలించకపోవడం ఆశ్చర్యం.

ఈ విగ్రహం నెలకొల్పిన స్థలం కొంకణ ప్రాంతంలో ఉంటుంది. అది సముద్ర తీరానికి చేరువలో ఉంటుంది. సముద్రం మీంచి ఉప్పు గాలులు వీచినందువల్ల లోహంతో చేసినవన్నీ త్వరగా తుప్పుపట్టి పాడైపోతాయి. నెలకొల్పే విగ్రహాలు ఎలా ఉండాలో నిర్మాణ విద్య తెలిసిన ఇంజనీర్ల ఆధ్వర్యంలో జరగాలి. అలా జరిగిందో లేదో తెలియదు. విగ్రహాన్ని నెలకొల్పినప్పుడు కింది భాగంలో వెల్డింగ్ చేశారట. సముద్ర గాలి వల్ల అది తుప్పుపట్టి విగ్రహం కూలిపోయింది. విగ్రహం భారీదైనప్పుడు దాని వేదిక కూడా విశాలంగా, పకడ్బందీగా ఉండాలి. అదీ ఉన్నట్టు లేదు. నిర్మాణ లోపాలు ఎన్ని ఉన్నప్పటికీ సకల ఆవిష్కరణలు తన చేతుల మీద జరగాలని మోదీ భావిస్తారు. అయోధ్యలో రామ మందిరం అంతే హడావుడిగా నిర్మించారు. ఆ ఆలయానికి వెళ్లే దారులు కుంగిపోయాయి. పార్లమెంటు నూతన భవన నిర్మాణాన్ని ఆఘమేఘాల మీద నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. దాని చూరు కారడం మొదలు పెట్టింది. ఈ అన్ని పనులు తన అధీనంలో జరిగాయని చెప్పుకోవడానికి, వీటి ఆధారంగా లబ్ధి పొందడానికి మోదీ నిరంతరం కాచుకు కూర్చుంటారు. ఆ హడావుడే శివాజీ విగ్రహం నేలకూలడానికి కారణం అయి ఉండొచ్చు. మహారాష్ట్రలో శివాజీని ఆరాధ్యుడిగా భావిస్తారు కనక విగ్రహం కూలడం జనాగ్రహానికి దారి తీసింది. ఇది మహారాష్ట్రకే పరిమితం కాలేదు. ఇలాంటి విషయాలలో రాజకీయాలకు స్థానం ఉండకూడదు. కానీ ప్రస్తుత వ్యవస్థలో అన్నింటా రాజకీయమే ఉంటుంది. పైగా రాజకీయ నాయకులు, ప్రధానంగా అధికారంలో ఉన్నవారు రాజకీయాలు చేయొద్దని గోల చేస్తారు. మహారాష్ట్రలో ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య మిగతా రాష్ట్రాలకన్నా చాలా ఎక్కువ. ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దంటారు. కాని రాజకీయం చేసేది ప్రధానమంత్రి మెప్పుకోసం హడావుడి చేసేవారే. ఈ వర్గాలే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సకల విషయాల మీద రాజకీయమే చేస్తారు. అప్పుడు తాము న్యాయం కోసం పోరాడుతున్నామని బుకాయిస్తారు. మోదీ ముంబైలో అడుగు పెట్టగానే ప్రజాగ్రహాన్ని చవి చూడాల్సి వచ్చింది. నల్ల జెండాలతో ప్రజలు ఆయనకు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శివాజీ విగ్రహం కూలినందుకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పడానికి ఈ జనాగ్రహమే కారణం. విగ్రహం కూలిన చోటు కంటే ముంబైలో సముద్రం మీంచి వీచేగాలులు మహా ప్రచండంగా ఉంటాయి. కానీ అక్కడి విగ్రహాలకు ఈ దుర్గతి పట్టడం లేదుగా! ఇలాంటి అంశాలను రాజకీయం చేయొద్దన్న మాట నిజమే. కానీ జరుగుతున్నదే అది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీనితో సంబంధం లేదు అంటూ ఉంటే అజిత్ పవార్ క్షమాపణ చెప్పడం చూస్తేనే ఈ విషయంలో రాజకీయాలు ఎంత లోతుగా ఉన్నాయో అర్థం అవుతుంది. త్వరలో మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగవలసి లేకపోతే, ముంబైలో జనాగ్రహం చవి చూడవలసిన దుర్గతే పట్టకుండా ఉంటే మోదీ క్షమాపణ చెప్పే వారా! ఆయనదీ ఫక్తు రాజకీయమే. క్షమాపణా రాజకీయమే.

ధరలపై సమరానికి సిద్ధం

నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటి పరుగులు తీస్తున్నాయి. దీంతో సామాన్యుడి పరిస్థితి ఘోరంగా మారుతోంది. పేద, సామాన్య వర్గాల ప్రజలు రోజువారీ సరుకులు కొనుగోలు చేయలేక ఆర్థికంగా చితికిపోతున్నారు. నిత్యావసరాల ధరలు నానాటికీ పెరిగిపోతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపకుండా ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. కేవలం ఎన్నికల సమయంలో తప్ప రాజకీయ పార్టీలు నానాటికి చుక్కలంటుతున్న ధరల గురించి ఏమాత్రం నోరుమెదపడం లేదు.

ప్రజాసమస్యలపై నిత్యం పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ధరలపై సమరానికి సిద్ధమైంది. పార్టీ జాతీయసమితి పిలుపుమేరకు సెప్టెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు పెరిగిన ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని తదితర డిమాండ్లతో దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆందోళన కార్యక్రమాలు, 6వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించేందుకు సీపీఐ ఏపీ రాష్ట్ర సమితి కార్యాచరణను రూపొందించింది. గత సంవత్సర కాలంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిని అదుపు చేసేందుకు ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఏడాది కాలంగా నిత్యావసరాల ధరలు ప్రతీది అడ్డూ అదుపులేకుండా పెరుగుతునే ఉన్నాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ 2014లో గద్దెనెక్కినపుడు వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉండగా, నేడు రూ.950కి చేరింది. నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు 200 శాతం పెరిగాయని, కిలో బియ్యం రూ.70, కందిపప్పు రూ.210, వేరుశనగనూనె రూ.220కు చేరింది. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు, పేద వర్గాలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామనీ, ద్రవ్యోల్బణాన్ని సున్నా శాతానికి తగ్గిస్తామని చెప్పిన మోదీ మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. చౌకధరల దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తామన్న మాటలు ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. బియ్యం దగ్గర నుంచి పప్పులు, తైలాల ధరలు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. చింతపండు, పంచదార, అల్లం తదితర సరుకుల ధరలు అమితంగా పెరిగిపోతున్నాయి. కూరగాయలు, ఆకు కూరల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారస్తులు కృత్రిమ కొరతను సృష్టించడం, దళారీ వ్యవస్థ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి సరిగ్గా లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు కొంతవరకు కారణం. వ్యాపారస్తులు ఇష్టానుసారంగా ధరలను పెంచుతున్నప్పటికీ నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఎడాపెడా ధరలు పెరిగిపోవడంతో సామాన్యుడు వాటిని కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యవసర సరుకుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేస్తున్న సూచి కూడా అనుమానాలకు తావిస్తోంది. వినియోగ ధరల సూచీ ప్రకారం గత నెలలో ద్రవ్యోల్బణం 3.5 శాతానికి చేరింది. రిటైల్ ద్రవ్యోల్బణం గత ఐదు సంవత్సరాలలో ఇంత తక్కువగా నమోదు కావడం ఇదే మొదటిసారని ప్రభుత్వం చెబుతోంది. ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైనప్పుడు ధరలు తగ్గి, ప్రజల కష్టాలు తగ్గాలి, అలా జరగకపోగా మరింతగా పెరుగుతుండటంతో ఈ లెక్కల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. కీలకమైన ఆహార వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గకపోవడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. వినియోగ ధరల సూచీలో ఆహార, సంబంధిత వస్తువుల వాటా 46 శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా అంటే 54 శాతంగా ఉంది. ఈ పరంగా చూస్తే సాధారణ భారతీయ కుటుంబం తన నెలసరి వ్యయంలో సగం ఆహారం, దాని అనుబంధ వస్తువుల కొనుగోలుకే ఖర్చు చేస్తోంది. రానున్నది పండుగల సీజన్ కావడంతో ధరలు మరింత పెరుగుతాయని సామాన్యుడు ఆందోళన చెందుతున్నాడు. కూరగాయల ఉత్పత్తిపై రుతుపవనాల ప్రభావం తీవ్రంగా పడింది. దీనితో కీలకమైన ఉల్లి, బంగాళాదుంపల ఉత్పత్తి జులై నెలలో 60.54, 65.64 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే సీజన్‌లో బంగాళాదుంపల ఉత్పత్తి 6 శాతం, ఉల్లి ఉత్పత్తి 20 శాతం తగ్గింది. వర్షాలు కురవడంలో జాప్యం కారణంగా ఈ ఏడాది ఉత్పత్తి ఇంకా మార్కెట్‌లోకి రాలేదు.

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆదివారం నుంచి ఆరు రోజులపాటు సీపీఐ నిర్వహించే ఆందోళనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ధరల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలి. పాలకులు నిద్రావస్థను వదిలి ధరలను అదుపుచేసేందుకు చర్యలు తీసుకునేలా ప్రజల నిరసన మారుమోగాలి.

ఎం. మురళీకృష్ణ

ఇప్పటికీ బాలారిష్టాల్లోనే పోలవరం!

వి. శంకరయ్య

పోలవరం ప్రాజెక్టు రెండవ డీపీఆర్ ఆమోదించడంలో సహజ సిద్ధంగా, చట్ట బద్ధంగా జాతీయ ప్రాజెక్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబించే సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరించింది. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏ విధానమైతే అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నదో దాన్నే ప్రాతిపదిక చేసుకొని తనకు కేంద్రంలో వెన్నుదన్నుగా నిలచిన కూటమి ప్రభుత్వ హయాంలో కూడా ప్రాజెక్టుకు తొలిదశ అనే బొట్టుపెట్టి రెండవ డీపీఆర్ కేవలం 30,437 కోట్ల రూపాయల వ్యయంతో ఆమోదించినది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌పై సవతి తల్లి ప్రేమ ఇప్పటికీ వీడలేదు. పోలవరం ప్రాజెక్టు రెండవ డీపీఆర్ ఆమోదించడంలో సహజ సిద్ధంగా, చట్ట బద్ధంగా జాతీయ ప్రాజెక్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబించే సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరించింది. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏ విధానమైతే అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నదో దాన్నే ప్రాతిపదిక చేసుకొని తనకు కేంద్రంలో వెన్నుదన్నుగా నిలచిన కూటమి ప్రభుత్వ హయాంలో కూడా ప్రాజెక్టుకు తొలిదశ అనే బొట్టుపెట్టి రెండవ డీపీఆర్ కేవలం 30,437 కోట్ల రూపాయల వ్యయంతో ఆమోదించినది. అప్పటికీ ఇప్పటికీ తేడా ఒక్కటే! ఇంత వరకు దస్త్రాలకే పరిమితం చేయగా ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గం ఆమోదించినందున ఇస్తామంటున్న 12,157 కోట్ల రూపాయలు నిధులు విడుదలకు మార్గం సుగమం అయింది. అందుకేనేమో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నిరాశ నిస్పృహలతో వున్న రాష్ట్రానికి ఇది శుభ సూచికమని వ్యాఖ్యానించారు.

2022 లో కర్నాటకలో బీజేపీ ప్రభుత్వ సమయంలో ఎగువ భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన సమయంలో కేంద్ర ప్రభుత్వం పదిమంది కేంద్ర కార్యదర్శుల సమావేశం వెనువెంటనే జరిపి పది రోజుల్లో కథాకమామీషు ముగించి ప్రాజెక్టు సమగ్ర డీపీఆర్‌కు ఆమోదం తెలిపి ఏకంగా బడ్జెట్‌లో 5300 కోట్ల రూపాయల కేటాయించింది. అంతేకాదు. మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించి వున్న రాయలసీమ లాగా బాగా వెనుకబడిన బుందేల్ ఖండ్ ప్రాంతానికి (రాష్ట్ర విభజన సమయంలో బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ రాయలసీమకు ప్రకటించారు) సాగునీరు అందించేందుకు యమునానది ఉప నదులైన కెన్ బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు 44,605 కోట్లతో సమగ్ర డీపీఆర్‌ను కేంద్రం ఆమోదించింది. పైగా తాగునీటి వ్యయం కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. మరి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏం పాపం చేశారని పదేళ్లు గడచినా సమగ్ర డీపీఆర్ కేంద్రం ఎందుకు ఆమోదించ లేదు? ప్రత్యేక హోదా లాగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం హామీ కాదు. చట్ట బద్ధత గల ప్రాజెక్టు. అంత వరకైతే ఫర్వాలేదు. దేశంలో నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టులకన్నింటికీ ఏటా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటా యిస్తున్నారు. ఒక్క పోలవరం ప్రాజెక్టుకు మాత్రం నాబార్డు ద్వారా నిధులు ఇప్పిస్తున్నారు. ఇది పక్ష పాతం కాదా? ఎందుకీ వివక్ష - కక్ష? పోలవరం ప్రాజెక్టుకు తొలిదశ అనే దుర్మార్గమైన విష బీజాన్ని జగన్‌మోహన్ రెడ్డి 2020లోనే వేశారు. పోలవరం ప్రాజెక్టు సమీక్షా సమావేశం నిర్వహిస్తూ "డ్యాం సేఫ్టీ అండ్ స్టెబిలిటీ ప్రొటోకోల్" ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు. తదుపరే పట్టిసీమ ఎత్తిపోతలువున్నా మరో ఎత్తిపోతల పథకం ప్రతిపాదించారు. కేంద్రం వద్ద సమగ్ర డీపీఆర్ ఆమోదం పొందటం సాధ్యం కాదనే తదనుగుణంగా తొలి దశకు పదివేలకోట్ల రూపాయలు అడ్‌హాక్‌గా ఇవ్వాలని 2023 జులై 19 వతేదీ తొలి దశ అంచనాలను 36449.83 కోట్ల రూపాయల వ్యయంతో సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కేంద్ర జల సంఘం పరిశీలన అనంతరం 31625. 28 కోట్లకు కుదించారు. బాలెన్స్ పనులకోసం 15505.81 కోట్లు అవసరమని కోరితే అందులో 4824. 45 కోత పెట్టారు. హెడ్‌వర్క్స్ పద్దు కింద 3031 కోట్ల రూపాయలు కోత పెట్టారు. ఈ పరిణామ క్రమంలోనే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 12157 కోట్ల రూపాయలు రెండు దఫాలుగా ఇచ్చేలా డీపీఆర్‌ను ఆమోదించింది.

అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును తన మానసపుత్రికగా భావిస్తున్నారు కాబట్టి 2026కు తొలిదశ నిర్మాణం పూర్తి చేయ వచ్చు. కాని గతంలో తను అధికారంలో వున్న సమయంలో 2019 ఫిబ్రవరి నెలలో కేంద్ర జలశక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా మండలి ఆమోదించిన 55548.87 కోట్ల వ్యయంతో కూడిన డీపీఆర్ ఆమోదం కేంద్రం నుంచి పొందితే తప్ప ప్రస్తుతం పొత్తిళ్లలో వున్న పోలవరం ప్రాజెక్టు భవిష్యత్‌కు భద్రత ఏర్పడదు.

వాస్తవం చెప్పాలంటే సాంకేతిక సలహా మండలి ఆమోదించిన అంచనాలు ప్రామాణికంగా వున్నాయి. ఎందుకంటే దేశంలో ఏ ప్రాజెక్టు నిర్మాణం జరిగినా ప్రథమ లబ్ధిదారులు ముంపు బాధితులౌతారు. సర్వస్వం కోల్పోయి సుదూర ప్రాంతాలకు చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లా చెదురుగా పోతారు. అందుకే సాంకేతిక సలహామండలి ఆమోదించిన అంచనాలో సింహభాగం 33,168.23 కోట్ల రూపాయల భూసేకరణ సహాయ పునరావాస కార్యక్రమాలకు కేటాయించింది. ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌కు 9,734.34 కోట్లు మాత్రమే కేటాయించినది. ఈ గణాంకాలు పరిశీలిస్తే ముంపు బాధితుల పట్ల ఏ వైఖరి తీసుకున్నారో అవగతం అవుతుంది. తుదకు సవరించిన వ్యయం అంచనాల కమిటీ కూడా ముంపు బాధితుల పద్దు కింద 28,172 .21 కోట్ల రూపాయలు కేటాయించింది. నేటి విషాదమేమంటే ఇప్పటివరకు ఈ పద్దు కింద కేవలం 5 021.99 కోట్ల మాత్రమే వ్యయంచేసి వున్నారు. ప్రస్తుతం తొలిదశలో ఈ పద్దు కింద 13,545.44 కోట్ల రూపాయల అవసరమని 5,021.99 కోట్లు వ్యయం చేసినందున ఇంకా 7,802. 58 కోట్ల రూపాయల కావాలని జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పంపిన ప్రతిపాదనల్లో వుంది. దాన్నే ప్రాతిపదిక చేసుకొని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నది. ముమ్ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిదశ పూర్తిచేసిన తర్వాత కూడా భూసేకరణ నష్టపరిహారం, పునరావాసంకింద మాత్రమే మరొక 20 వేల కోట్ల రూపాయల అవసరమౌతుంది. ఈ గణాంకాలు పరిశీలిస్తే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు సముద్రంలో కాకి రెట్ట పడిన చందంగా వుంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 45.72 మీటర్లకు నిర్మాణం జరగాలంటే కేంద్రం నుంచి సింహభాగం నిధులు రాబట్ట వలసివుంది. పోలవరం ప్రాజెక్టు ఎన్ని దశలుగా నిర్మించినా ఎవరికీ అభ్యంతరం లేదు. క్రమేణా నిధులు విడుదల చేయవచ్చు. కాని జాతీయస్థాయిలో జాతీయ ప్రాజెక్టుల నిర్మాణం సందర్భంగా అనుసరించే సార్వజనీన సూత్రం ప్రకారం వెను వెంటనే ప్రాజెక్టు సమగ్ర డీపీఆర్ కేంద్రం ఆమోదించ వలసి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తొలి దశ నిర్మాణం పూర్తయ్యే వరకు ఆగకుండా ఎంత త్వరగా సమగ్ర డీపీఆర్ ఆమోదం పొందగలిగితే తన మానస పుత్రిక భవిష్యత్తుకు బరోసా కల్పించిన వారౌతారు.

విశ్రాంత పాత్రికేయులు సెల్: 9848394013

ఎవరీ ఉత్తరభారత పెరియార్- లలైసింగ్?



డాక్టర్ దేవరాజు మహారాజు

ద్రవిడోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త ఇ.వి.రామస్వామి పెరియార్ 'కీమాయణాన్ని' తొలిసారి 'సచ్చీ రామాయణ్' శీర్షికతో హిందీలోకి అనువదించిన రచయిత లలైసింగ్ యాదవ్. తమిళనాడు, తిరుచురాపల్లి జిల్లా, పోస్ట్ పుత్తూరు, మాలిగాయి గ్రామవాసి "రామాయణ్ పాథ్ థిరంగల్" అనే పుస్తకం రచించి ప్రచురించారు. ఇది వాల్మీకి రామాయణానికి పెరియార్ రామసామి చేసిన సమీక్ష. దీని ఇంగ్లీషు అనువాదాన్ని "ద రామాయణ ఎ ట్రూ రీడింగ్" శీర్షికతో రేషనలిస్ట్ పబ్లికేషన్, తమిళనాడు-2 వారు 1951 లో ప్రచురించారు. దీని ఆధారంగా కాన్పూర్ జిల్లా, పోస్ట్: ఝీ ఝక్ గ్రామం: కఠారా వాసి చౌధరీ లలై సింగ్ యాదవ్ తొలిసారి హిందీలోకి అనువదించి, 1 అక్టోబర్ 1968 న ప్రచురించాడు. ఇది మూల్ నివాసి ప్రచార్ ప్రసార్ కేంద్రం ప్రచురణగా వెలువడింది. ఆ స్క్రిప్టు చూసి యు.పి నుంచి ఢిల్లీ దాకా ఏ ప్రచురణకర్తా ముందుకు రాలేదు. మనువాదులు సృష్టించిన భయం అందుకు కారణం. అప్పుడాయన తన 15 ఎకరాల భూమి అమ్మి ఒక ప్రింటింగ్ ప్రెస్సే ప్రారంభించాడు. అందులో సచ్చీ రామాయణ్ ప్రచురించాడు. అయితే అది గొప్ప సంచలనమైంది. హిందూ ధర్మ పరిరక్షకులమని భావించే వారంతా తమ ధార్మిక భావనలు దెబ్బతిన్నాయని పెద్ద ఎత్తున రోడ్డెక్కి ప్రదర్శనలిచ్చారు. వారి ఒత్తిడికి తలొగ్గిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, గజెట్ 20 డిసెంబర్ 1961 న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆ పుస్తకం హిందీ, ఇంగ్లీషు ప్రతుల్ని జప్తు చేసుకుంది. న్యాయం కోసం లలైసింగ్ అలహాబాదు హైకోర్టు తలుపు తట్టాడు.

ఈ పుస్తకం అధిక సంఖ్యాకులైన హిందువుల మనోభావాల్ని దెబ్బతీస్తోందనీ శ్రీరాముడు, సీత, జనకుడు వంటి వారంతా హిందూ దేవీ దేవతలని, వారిని తాము నిత్యం పూజిస్తుంటామని- అలాంటి వారి గురించి ఈ పుస్తకంలో నీచమైన వ్యాఖ్యానాలు ఉన్నాయనీ అందువల్ల పుస్తకాన్ని నిషేధించడం అవసరమని ప్రభుత్వ లాయరు తన వాదన వినిపించాడు. లలైసింగ్ పక్షాన వాదించిన అడ్వొకేట్ బన్వారీలాల్ యాదవ్ 'సచ్చీ రామాయణ్' ఔన్నత్యాన్ని బలంగా వినిపించి, కేసును నెగ్గించారు. 19 జనవరి 1971 న జస్టిస్ ఎ.కీర్తి వెలువరించిన తీర్పు- రెండు మూడు విషయాలు స్పష్టం చేసింది. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది కాబట్టి, మూల రచయిత పెరియార్ రామసామి తన అభిప్రాయాలు తెలియజేశారనీ, ఈ లలైసింగ్ కేవలం పెరియార్ పుస్తకాన్ని అనువదించాడని, ఇది అంత తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదని చెప్పింది. దానితో పాటు జప్తుచేసిన పుస్తకాల ప్రతులు తిరిగి ఇచ్చేయాలనీ, కోర్టు ఖర్చుల కింద లలైసింగ్ యాదవ్‌కు రూ.300/- ఇవ్వాలని కూడా తీర్పు చెప్పింది. ఆ రోజుల్లో రూ.300/- పెద్ద మొత్తమే! బహు జన క్రాంతి నాయకుడైన లలైసింగ్ గెలిచి, మనువాదుల నోళ్లు వారి చేతిలో కీలుబొమ్మగా మారిన ఆనాటి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వారి నోరూ మూయించాడు. పెరియార్ ఇ.వి.రామసామి ఆలోచనల్ని జనంలోకి బాగా తీసుకుపోయినందుకు జనం లలైసింగ్‌ను 'ఉత్తర భారత పెరియార్' అని పిలుచు కున్నారు. ది. పెరియార్ ఇ.వి.రామసామి భావ జాలానికి బాగా ఆకర్షితుడైన లలైసింగ్, ఆయన నాయకర్‌ను వదిలేసిన విధంగా- ఈయన కులం గుర్తుగా ఉన్న యాదవ్‌ను వదిలేశాడు. కాన్పూర్ దగ్గర ఏదో ఒక చిన్న ఊళ్లో ఉండేవాడు. పెద్ద పెద్ద కోర్టులలో ఏళ్లకేళ్లు పోరాడి కేసులు గెలుస్తూ, న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా తన చర్యను సమర్థించుకున్నందుకు సమాజం ఉలిక్కిపడింది. బ్రాహ్మణ వాద ప్రభావంలో కొట్టుకుపోయి, ఇక అదే ప్రపంచమనుకుంటూ, మూఢనమ్మకాలలో ముక్కి మూలిగే బహుజనులంతా ఒక్కసారి కళ్లు తెరిచారు. అందరి దృష్టీ లలైసింగ్‌పై పడింది. ఎవరీ లలైసింగ్ యాదవ్? ఏమిటీ సచ్చీ రామాయణ్- అని తెలుసుకోవడం ప్రారంభించారు. క్రమంగా లలైసింగ్ దళిత, బహుజన నాయకుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా ఎదుగుతూ పెరియార్ రామసామి ధోరణిలో రచనలు చేయడం ప్రారంభించారు. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ అన్ని విషయాలలో అన్ని వేళలా సంఘర్షించడమే జీవితమన్నట్లుగా గడిపాడు.

చౌధరీ లలైసింగ్ యాదవ్ (1 సెప్టెంబరు 1911 - 7 ఫిబ్రవరి 1993) ఉత్తరప్రదేశ్ కాన్పూర్ దేహాత్ జిల్లాలో జిజక్ రైల్వే స్టేషన్ సమీపంలో కఠారా గ్రామంలో చౌధరీ గజ్జుసింగ్ యాదవ్, మూలాదేవి దంపతులకు జన్మించాడు. 1911 లో దేశం ఒకవైపు బ్రిటీషు పాలనలో ఉంది. మరోవైపు మనువాదుల ఆధిపత్యంలో ఉంది. వీరిది ఆస్తిపాస్తులున్న సంపన్న కుటుంబమే, కానీ బ్రాహ్మణ వాద ప్రభావం వల్ల సమాజంలో అణగిమణగి ఉండాల్సి వచ్చేది. శూద్రులయినందు వల్ల ఆ గ్రామంలో చదువుకునే అవకాశం ఉండేది కాదు. ఇష్టమైన బట్టలు, వస్తువులు కొనుక్కోవడానికి లేదు. అత్యంత సాధారణ జీవితం గడపాల్సి వచ్చేది. ఆ రోజుల్లో శూద్రుల స్థాయి ఎలా ఉండేదో...ఒక సంఘటన చూద్దాం! ఊళ్లో ఎవరి ఇంట్లో పెళ్లయినా, మహిళలంతా పెళ్లి ఇంటికి వెళ్లి పెండ్లి పనుల్లో సహాయపడేవారు. ఒకసారి ఒక అగ్రవర్ణం వారి పెండ్లి పనులు చేయడానికి లలైసింగ్ తల్లి మూలాదేవి వెళ్లింది. బయట ఉండి బయటి పనులు చేయకుండా తనకు వంట బాగా వచ్చు గనక, నేరుగా వంటశాలకు వెళ్లింది. అక్కడ ఉన్న అగ్రశ్రేణి మహిళలంతా మూలాదేవిని అవహేళన చేశారు. శూద్ర స్థాయి మరిచి, అగ్రవర్ణంలో కలవడానికి వేసిన ఎత్తుగడ అని నిందలు వేశారు. నానా మాటలు అన్నారు. సున్నిత మనస్కురాలైన మూలాదేవి అవమానం భరించలేక నిలువునా కుప్పగూలింది. అగ్రవర్ణ మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయి నిరసన వ్యక్తం చేశారు. తేరుకున్న మూలాదేవి పరుగు పరుగున ఇంటికి వెళ్లింది. వివక్షకు వ్యతిరేకంగా పోరాడే ఆత్మస్థైర్యాన్ని తాము తమ పుత్రుడికివ్వాలని ఆరోజే ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత కొంత కాలానికే 1925లో మూలాదేవి గుండె ఆగి చనిపోయింది. అప్పటికి లలైసింగ్ వయసు 14 ఏళ్లు. తనూ, తండ్రి గజ్జుసింగ్- ఇంట్లో ఇద్దరు మగవాళ్లు మాత్రమే మిగిలారు. ఒకరికి తల్లిలేక, మరొకరికి భార్యలేక వారి జీవితాలు దుర్భరమైపోయాయి.

గజ్జుసింగ్ అభ్యుదయ భావాలు గలవాడు గనక, తన కొడుకు విద్యావంతుడు కావాలనీ, సంఘసంస్కర్తగా మారాలనీ కలలుగనేవాడు. తన పరిధిలో తాను కొన్ని దురాచారాలకు ఎదురు తిరిగేవాడు. లలైసింగ్, అందరిలా పెండ్లి చేసుకోకుండా 17 ఏళ్ల వయసులో స్కూలు ఫైనల్ పూర్తి చేశాడు. 18వ యేట ఫారెస్ట్‌గార్డ్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత 20వ యేట దులారిదేవిని పెండ్లి చేసుకున్నాడు. పెండ్లి చేసుకున్న కొన్ని నెలలకే, గ్వాలియర్‌లో పారా మిలట్రీ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా కొత్త ఉద్యోగంలో చేరాడు. అక్కడ కూడా అసమానతలు, వివక్ష ఉన్న సంగతి గ్రహించి, తిరుగుబాటు చేశాడు. ఒకే ఉద్యోగంలో ఉన్నప్పుడు అందరూ సమానులే కదా? కానీ, స్నానం చేసే చోట, భోజనం చేసే చోట ప్రతి విషయంలోనూ మనువాద ఆధిపత్యం కనిపించేది. అగ్రవర్ణానికి చెందిన కానిస్టేబుళ్లు పైన స్నానం చేస్తే- వారు స్నానం చేసిన నీరు కిందికి పారినప్పుడు, ఆ నీళ్లలో శూద్ర- నిమ్న కులాల కానిస్టేబుళ్లు స్నానాలు చేయాల్సి వచ్చేది. లలైసింగ్ ఆ పద్ధతిని ఎదిరించాడు. పై అధికారులకు క్రమశిక్షణారాహిత్యంగా అనిపించి సస్పెండ్ చేశారు. పైనున్న ఒక బ్రిటీషు అధికారి అసలు విషయం తెలుసుకుందామని లలైసింగ్‌ను పిలిపించుకుని విచారించాడు. బయట సమాజంలో ఉన్న అమానవీయ విధానాలు పోలీసు- మిలట్రీ శాఖలలో కూడా ఉన్నాయని లలైసింగ్ వివరణ ఇచ్చుకున్నాడు. వివక్ష వికృతత్వాన్ని అర్థం చేసుకున్న ఆ బ్రిటీష్ అధికారి అందరూ సమానులే అని ప్రకటించాడు. పైగా లలైసింగ్ యాదవ్‌కు ప్రమోషన్ ఇచ్చి ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలాంటి అవకతవకల మీదే లలైసింగ్ తర్వాత కాలంలో 'సిపాయీ క తబాహీ' అనే చిన్న పుస్తకం రాశాడు. ఉధృతంగా సాగుతున్న భారతదేశ స్వాతంత్ర్యానికి మద్దతు ప్రకటించాడు. బ్రిటీషు ఉద్యోగిగా ఉంటూ అలా చేయడంవల్ల 5 ఏళ్లు జైలుశిక్ష పడింది. ఆ రకంగా స్వాతంత్ర్యయోధుడిగా చరిత్రలో నిలిచాడు. 1947 లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి లలైసింగ్ శిక్ష ఇంకా సంవత్సరం కూడా పూర్తికాలేదు. మిగతా శిక్ష పూర్తి కాకుండానే స్వతంత్ర భారతంలో విడుదలై బయటికొచ్చాడు. లలైసింగ్ జీవితంలో ఒకే సమయంలో రెండు పోరాటాలు చేశాడు. ఒకటి - బ్రిటీష్ వారితో పోరాటం! మరొకటి- పెరియార్ రామసామి, డా.బి.ఆర్.అంబేద్కర్‌ల అనుయాయిగా బ్రాహ్మణ వాదులతో పోరాటం!!

దృష్టి సమాజ ఉద్ధరణ మీద, మూఢ నమ్మకాల నిర్మూలన మీద, కొనసాగుతున్న వివక్ష మీద చేయాల్సిన పోరాటాల మీద పెట్టి- జీవితం కొనసాగించాడు. వీటికి అదనంగా 'సచ్చీ రామాయణ్ కేసు' హైకోర్టు, సుప్రీం కోర్టులలో ఏళ్లకేళ్లు ఎదుర్కోవడం మామూలు విషయం కాదు.

డా.బి.ఆర్.అంబేద్కర్ నాగ్‌పూర్‌లో 14 అక్టోబర్ 1956 బౌద్ధం స్వీకరించిన రోజునే ఆయనతో పాటుగా తను కూడా బౌద్ధం స్వీకరించాలని లలైసింగ్ అనుకున్నాడు. కానీ, టి.బి వ్యాధి వల్ల ప్రయాణం చేయలేక, ఆరోజు అక్కడికి చేరుకోలేకపోయాడు. అయితే అంబేద్కర్ ఏ బౌద్ధ భిక్షువుతో దీక్ష తీసుకున్నారో మళ్లీ అదే బౌద్ధ భిక్షువు భంతే చంద్రమణితో మరికొంత కాలానికి బౌద్ధమతం తీసుకుని లలైసింగ్ బౌద్ధగా మారిపోయాడు.

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

సెప్టెంబరులో వానలే వానలు

వాయువ్య భారతానికి భారీ నుంచి అతిభారీ వర్ష సూచన : ఐఎండీ

న్యూఢిల్లీ: సెప్టెంబరు నెలలో వానలే వానలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. వాయువ్య భారతాన్ని భారీ నుంచి అతి భారీ వర్షాలు ముంచెత్తుతాయని తెలిపింది. బంగాళాఖాతంలో మరిన్ని అల్పపీడనాలు ఏర్పడతాయని, అవి పశ్చిమ-వాయువ్యం దిశగా రాజస్థాన్ వైపునకు కదులుతాయని అంచనా వేసింది. ఆగస్టులో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవగా సెప్టెంబరులోనూ సాధారణం కంటే అధికంగా 167.9 ఎంఎంల వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మొహపాత్ర శనివారం వర్చువల్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న అంచనా ఉన్నట్లు తెలిపారు. దేశంలోని అనేక భాగాల్లో సాధారణం కంటే అధికంగానే వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఉత్తర బీహార్, ఈశాన్య ఉత్తరప్రదేశ్‌తో పాటు ఈశాన్య భారతంలోని కొన్ని చోట్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అంచనా ఉన్నట్లు వెల్లడించారు. అస్నా తుపాను ప్రభావంతో గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక తీర ప్రాంతాల్లో ఈదురు గాలులతో అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని తెలిపింది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని కూడా వెల్లడించింది. ఆదివారం గంటలకు 45-55 కిమీల వేగంతో గాలులు వీస్తాయని, వాటి వేగం గంటకు 65కిమీల వరకు పెరగవచ్చని ఐఎండీ హెచ్చరించింది.

నితీశ్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: బీహార్ సీఎం నితీశ్ కుమార్‌ను జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడిగా ఎన్నుకోవడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పరిశీలించిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. జేడీయూ నుంచి బహిష్కరణకు గురైన గోవింద్ యాదవ్, పార్టీ అధ్యక్షుడిగా నితీశ్ కుమార్ ఎన్నిక కావడాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29ఏ(9)కు అనుగుణంగా ఆయన ఎన్నిక జరుగలేదని ఆరోపించారు. కాగా, జస్టిస్ పుష్పేందర్ కుమార్ కౌరవ్‌తో కూడిన ధర్మాసనం ఆగస్టు 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ పేర్కొన్న అంశాలు విచారణ పరిధికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. గతంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఈ పిటిషన్‌కు వర్తించవని పేర్కొంది. ఎన్నికల ఫలితాల్లో కోర్టు జోక్యం చేసుకోదని స్పష్టం చేసింది. పిటిషన్ మెరిట్ లేనిదిగా పరిగణించిన ఢిల్లీ హైకోర్టు దానిని డిస్‌మిస్ చేసింది.

మత విశ్వాసాలపై దాడికి హక్కులేదు

అసోంలో నమాజ్ విరామం రద్దుపై జేడీయూ

పాట్నా: ఎన్డీయేలో బీటలు మొదలయ్యాయి. ఇప్పటికే కులగణన కోసం బిగ్గరగా డిమాండ్ చేస్తున్న కీలక మిత్రపక్షం జేడీ(యూ), అసోంలో నమాజ్ విరామం రద్దుపైనా అగ్గి మీద గుగ్గిలమైంది. పేదరికం, వరదలపై దృష్టి సారించడం మానేసి ముస్లింలను లక్ష్యంగా చేసుకొన్న అసోంలోని బీజేపీ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపించింది. రాజ్యాంగానికి విరుద్ధంగా హిమంత బిశ్వశర్మ ప్రభుత్వం పనిచేస్తోందని దుయ్యబట్టింది. మత విశ్వాసాలపై దాడి చేసే హక్కు ఎక్కడిదని తీవ్రస్థాయిలో మండిపడింది. కీలక భాగస్వామి నుంచి వ్యతిరేక వస్తుండగంతో ఎన్డీయేలో అంతర్గత చిచ్చు రాజుకుంది. మత సామరస్యాన్ని దెబ్బ తీయడమే కాకుండా మత సంప్రదాయాలు ఆచారాలను కాపాడుకునే హక్కులను కాల రాసే విధంగా అసోం అసెంబ్లీ నమాజ్ బ్రేక్‌ను రద్దు చేసిందని ఘాటు విమర్శలు చేసింది. శు క్రవారం నమాజ్ కోసం శాసనసభ్యులకు రెండు గంటల విరామం ఇచ్చే సంప్రదాయాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని జేడీయూ నేత నీరజ్ కుమార్ విమర్శించారు. పేదరికం నిర్మూలనపై అసోం సీఎం మరింత దృష్టి పెడితే బాగుంటుందన్నారు. రంజాన్ సందర్భంగా శుక్రవారం సెలవులపై నిషేధం విధిస్తున్నారు కానీ హిందూ సంప్రదాయంలో కామాఖ్య దేవాలయం దగ్గర బలి ఆచారాన్ని నిషేధిస్తారా? అని నీరజ్ కుమార్ ప్రశ్నించారు. మత విశ్వాసాలపై దాడి చేసే హక్కు ఎవరికీ లేదని స్పష్టంచేశారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి సాధికారతకు, అసోం వరదల పరిస్థితులను పరిష్కరించడం కోసం ఏం చేస్తున్నారని నిలదీశారు. ఆయా అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తే బాగుండేదని హిమంత బిశ్వశర్మకు నీరజ్ హితవు పలికారు.

మా డిమాండ్లు పరిష్కరించాల్సిందే

రైతు సంఘాల డిమాండ్: రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సంఘీభావం

చండీగఢ్: కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించాలని ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ కోరారు. శనివారం పంజాబ్, హర్యానా మధ్య శంభు సరిహద్దు వద్ద నిరసన తెలిపిన రైతులకు ఆమె సంఘీభావం తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా... కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి చట్టపరమైన హామీతో సహా తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఒత్తిడి చేసేందుకు చేపట్టిన 'ఢిల్లీ చలో' ఆందోళన 200 రోజులు పూర్తయిన సందర్భంగా 'కిసాన్ మహాపంచాయత్' నిర్వహించాయి. ఫిబ్రవరి 13 నుంచి తమ పాదయాత్రను భద్రతా బలగాలు అడ్డుకోవడంతో రైతులు పంజాబ్, హర్యానా మధ్య శంభు-ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద నిరసనలు చేస్తున్నారు. కాగా, ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో 50 కేజీల ఫైనల్ మ్యాచ్‌లో అనర్హత వేటు పడిన ఫోగట్‌ను నిరసన తెలిపిన రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినేశ్ ఫోగట్ రైతులకు తన మద్దతు తెలియజేస్తూ, 'మీ కుమార్తె మీతో ఉందని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను' అన్నారు. రైతుల డిమాండ్లు చట్టవిరుద్ధం కాదని కూడా ఆమె నొక్కి చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ డిమాండ్లను ఇప్పటికీ ఆమోదించకపోవడంతో రైతులు నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. 'వాళ్లను చూస్తే బాధగా ఉంది' అని అన్నారు. 'కొన్నిసార్లు వారి కోసం ఏమీ చేయలేక నిస్సహాయంగా భావిస్తాం. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాం. అయితే సొంత కుటుంబానికి ఏమీ చేయలేకపోతున్నామని, ప్రభుత్వం తమ మాట వినాలని కోరుతున్నాం' అని ఆమె తెలిపారు. 200 రోజులు గడుస్తున్నా తమ డిమాండ్లను అంగీకరించకపోవడంతో రైతులు రోడ్లపైనే కూర్చోవడం బాధాకరమని ఒక ప్రశ్నకు సమాధానంగా రెజ్లర్ అన్నారు. 'రైతులు మాకు ఆహారం ఇవ్వకపోతే మేము ఎలా పోటీ పడగలం. ఇంత జరుగుతున్నా వారు హృదయపూర్వకంగా దేశాన్ని పోషిస్తున్నారు. తమది పెద్ద మనస్సు అని, ప్రభుత్వం కూడా ఈ విషయంలో పెద్ద మనుస్సు చూపాలి' అని అన్నారు. హర్యానాలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై చర్కీ దాద్రీ జిల్లాకు చెందిన రెజ్లర్‌ను ప్రశ్నించగా, 'నాకు రాజకీయాల గురించి తెలియదు. దాని గురించి నాకు ఏమాత్రం అవగాహన లేదు' అని అన్నారు. హర్యానాలో రైతులు ఆందోళన చేస్తే మద్దతిస్తారా అని అడిగిన ప్రశ్నకు, 'ఎందుకు చేయకూడదు? దేశంలోని రైతులు కలత చెందుతున్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉండాలి. వారి పోరాటం వృథా కాదు. ఈ విషయంలో నేను కచ్చితంగా ఉన్నాను' అని అన్నారు.

అక్టోబరు 3న దేశవ్యాప్తంగా రైల్ రోకో

రైతునేత స్వర్ణసింగ్ పంధేర్ మాట్లాడుతూ ఆందోళనలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం తమ దీక్షను పరీక్షిస్తోందన్నారు. 'మరోసారి మన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళదాం. దీంతోపాటు కొత్త అంశాలను కూడా ప్రకటిద్దాం' అని తెలిపారు. 'మా నిరసనకు 200 రోజులు పూర్తయిన సందర్భంగా లఖింపూర్ ఖేరీ ఘటనకు న్యాయం చేయాలని కోరుతూ రైతు రుణమాఫీ, రైతు రుణమాఫీ సహా ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం అక్టోబరు 3న మధ్యాహ్నం 12:30 గంటల నుంచి దేశవ్యాప్తంగా రైల్ రోకోకు పిలుపునిచ్చాం. రెండు ఫోరమ్‌లు కలిసి హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రకటిస్తాయి. ఆదివారం ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించే మహాపంచాయత్‌లో అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. సెప్టెంబరు 15న జింద్, 22న పిప్లీలో జరుగుతాయి' అని ఆయన వివరించారు. ఢిల్లీలో ర్యాలీకి అధికారులు నిరాకరించడంతో రైతులు ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభూ సరిహద్దుల వద్దే ఆందోళన చేపట్టారు. పంటలకు చెల్లించే కనీస మద్దతు ధరకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎంపీ, సినీనటి కంగనా రాణవత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. హర్యానాలోని బలాలీకి చెందిన ఫోగట్... పారిస్ ఒలింపిక్స్‌లో తన 50 కిలోల ఫైనల్ మ్యాచ్ రోజున అనర్హత వేటుకు గురై హృదయ విదారక నిష్క్రమణను ఎదుర్కొంది. గత సంవత్సరం లైంగిక వేధింపుల ఆరోపణలపై అప్పటి భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కి వ్యతిరేకంగా హర్యానాకు చెందిన రెజ్లర్లు చేసిన ఆందోళనలో ఆమె భాగమైంది. కొద్ది రోజుల క్రితం హర్యానాలోని రోహ్‌తక్‌లోని సర్వ్‌ఖాప్ పంచాయతీ ఆమెను బంగారు పతకంతో సత్కరించింది.

హర్యానాలో రెచ్చిపోయిన గోమూకలు

ఇద్దరు ముస్లిం యువకులపై దాడి: ఒకరి మృతి - ఐదుగురి అరెస్టు

న్యూఢిల్లీ: హర్యానాలో గోమూకలు రెచ్చిపోయారు. గోమాంసం తిన్నారన్న నెపంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన 26ఏళ్ల వలస కార్మికుడిని చావ గొట్టారు. అసోంకు చెందిన వలస కార్మికుడు అసిరుద్దీన్‌తో కలిసి గో మాంసాన్ని తిన్నారన్న అనుమానంతో సాబిర్‌పై మూకదాడికి పాల్పడ్డారు. ఈ ఘటన హర్యానాలోని చర్ఖిదాద్రీలో జరిగింది. ముస్లిం యువకులు ఇద్దరిపై దాడి కేసులో ఐదుగురిని హర్యానా పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులను అభిషేక్, రవీంద్రన్, మోహిత్, కమల్‌జీత్, సాహిల్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. ఇద్దరు యువకులను స్క్రాప్ అమ్మకం కోసం రావాలని మభ్యపెట్టి బస్టాండ్‌కు తీసుకెళ్లారని, ఆపై వారిపై దాడి చేశారన్నారు. సాబిర్‌ను, అసిరుద్దీన్‌ను బైకులపై వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్లారని చెప్పారు. భండ్వా గ్రామంలోని కాలువ సమీపంలో నిర్జీవంగా పడివున్న సాబిర్‌ను గుర్తించినట్లు తెలిపారు. తీవ్ర గాయాలతో అసిరుద్దీన్ మరొక ప్రాంతంలో దొరికారని పోలీసులు చెప్పారు. నిందితులు గోరక్షక బృంద సభ్యులని, గో మాంసాన్ని తిన్నారనే అనుమానంతో కార్మికులిద్దరిపై దాడి చేశారని చర్ఖీ దాద్రీ ఎస్పీ పూజా వశిష్ట్ తెలిపారు. దాడి సమయంలో అక్కడే ఉన్న కొందరు ఈ ఘటనను వీడియో తీశారు కానీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. సాబిర్ ప్రాణం తీసిన వారిని చట్టబద్ధంగా కఠినంగా శిక్షించాలని ఆయన బావమరిది సుజావుద్దీన్ డిమాండ్ చేశారు. తన భర్తను కొందరు వెంట తీసుకెళ్లారంటూ తన సోదరి వద్ద నుంచి ఫోన్ చేసి రావడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించినట్లు సుజావుద్దీన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దోషులను వదిలిపెట్టవద్దని ఆయన కోరారు.

మంకీ ఫీవర్ నిరోధక చర్యలు

మంత్రి సుబ్రమణ్యం



చెన్నై: ఐరోపా దేశాల్లో గుర్తించిన మంకీ ఫీవర్ రాష్ట్రంలో వ్యాపించకుండా పటిష్ఠమైన నిరోధక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రకటించారు. కోయంబత్తూరులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి... అక్కడి విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ... ఐరోపాలో గుర్తించిన మంకీ ఫీవర్ ప్రస్తుతం 121 దేశాలకు వ్యాపించిందని, ఆ వైరస్ వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలను హెచ్చరించిందని తెలిపారు. రాష్ట్రంలో మంకీ ఫీవర్ వ్యాపించకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మంకీ ఫీవర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి విమానాశ్రయాలలో మంకీఫీవర్ బాధిత విదేశీయుల కోసం ప్రత్యేక వార్డులు కూడా సిద్ధం చేసినట్లు వివరించారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో ఎవరికైనా మంకీ ఫీవర్ ఉన్నట్లు గుర్తిస్తే వారిని ఐసోలేషన్‌లో చికిత్స అందిస్తామన్నారు. విమానాశ్రయాలలో ప్రత్యేక వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. విదేశీ ప్రయాణికులకు మంకీ ఫీవర్ పరీక్షలు కూడా జరుపుతున్నట్లు తెలిపారు. ఇక చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి నగరాల్లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో 10 పడకల సదుపాయంతో మంకీఫీవర్ బాధితులకు ప్రత్యేక వార్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యకళాశాలల ఆసుపత్రుల్లో భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, నిఘా కెమెరాలు ఏర్పాటు చేశామని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. అనంతరం ఆయన కోయంబత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

కేసు నమోదు తర్వాతే తెలిసింది

వైద్యురాలి హత్యాచారపై సందీప్ ఘోష్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసు విచారణ చేస్తున్న సీబీఐ... ఆర్జీ కర్ మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కు లై-డిటెక్టర్ పరీక్ష నిర్వహించింది. అయితే అతడు వైద్యురాలు మృతిచెందిన విషయం తనకు ఆగస్టు తొమ్మిది ఉదయం 10.20 గంటల సమయంలో తెలిసిందని పేర్కొన్నారు. హాస్పటల్‌లోని ప్రొఫెసర్ సుమిత్ రాయ్ తపదర్ తనకు ఉదయం 10 గంటలకు ఫోన్ చేశాడని, ఆ సమయంలో స్నానం చేస్తుండటంతో మాట్లాడలేకపోయానని సందీప్ ఘోష్ తెలిపాడు. మిస్డ్ కాల్ ఉండటం చూసి 10.20 గంటల సమయంలో తిరిగి అతడికి కాల్ చేస్తే ఈ విషయం గురించి చెప్పారని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో ఏ వస్తువులను ముట్టుకోవద్దని, ఎవరినీ లోపలికి అనుమతించవద్దని వారికి చెప్పి, 11 గంటలకు ఆసుపత్రికి చేరుకున్నానని, అప్పటికే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అయితే మృతురాలి తల్లిదండ్రులకు ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆసుపత్రి వర్గాలు ఎందుకు చెప్పాయి... ఎవరు ఆవిధంగా చెప్పించారు... అనే కోణంలో సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. తాము ఘటనా స్థలానికి చేరుకున్న సమయానికి ఘోష్ ఎందుకు రాలేదన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించగా... అసత్య, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులకు, ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న మరో నలుగురు వైద్యులు, మరో సివిల్ వలంటీర్‌కు సీబీఐ కార్యాలయంలో పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నాయి. అయితే, నిందితులు ఏం చెప్పారన్న వివరాలను మాత్రం అధికారులు గోప్యంగా ఉంచారు. మరికొంతమందికి కూడా ఈ టెస్ట్ చేసే అవకాశం ఉంది. వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఆర్జీ కర్ వైద్య కళాశాల ఎదుట జూనియర్ డాక్టర్ల నిరసన కొనసాగుతోంది.

గవర్నర్ అధికార దుర్వినియోగం

కర్నాటక రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

బెంగళూరు: గవర్నర్ కార్యాలయం దుర్వినియోగానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో శనివారం 'ఛలో రాజ్ భవన్' కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ రాజ్ భవన్ రాజకీయ పార్టీ కార్యాలయంగా మారకూడదనే లక్ష్యంతో ఈ ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. 'మేము 'ఛలో రాజ్ భవన్' నిర్వహించింది ముఖ్యమంత్రి సిద్దరామయ్య తరపున కాదని స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఈ వ్యవహారం కోర్టులో ఉంది' అని ఉప ముఖ్యమంత్రి కూడా అయిన శివకుమార్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన ఈ పదవి పవిత్రతను కాపాడాలనే డిమాండ్‌తో అక్కడికి (రాజ్ భవన్) వెళ్లినట్లు చెప్పారు. కొంతమంది వ్యక్తులను విచారణ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ గవర్నర్ వద్ద అనేక పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని శివకుమార్ తెలిపారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ నిర్ణయాన్ని ఖండిస్తూ ప్లకార్డులు, బ్యానర్లు, పోస్టర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ శివకుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు పాదయాత్ర చేపట్టారు. ఇందులో అనేక మంది మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.

అనంతరం గెహ్లాట్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఇక్కడి విధానసౌధ ఆవరణలోని గాంధీ విగ్రహం దగ్గర సిద్దరామయ్య, ఆయన మంత్రివర్గ సహచరులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు బైఠాయించి బైఠాయించారు. మైసూరు పట్టణ అభివృద్ధి మండలి (ముడా) కుంభకోణంలో ముఖ్యమంత్రిని విచారణ చేయడానికి అనుమతి ఇవ్వడంతో గెహ్లాట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం విభేదిస్తోంది.

4న జమ్మూకశ్మీర్‌లో రాహుల్ ప్రచారం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని సెప్టెంబరు 4న తలపెట్టిన రెండు ర్యాలీలలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొంటారని కాంగ్రెస్ సీనియర్ నేత గులాం అహ్మద్ మీర్ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు, కాంగ్రెస్‌కు మధ్య ఎన్నికల పొత్తు కుదిరింది. సీట్ల సర్దుబాటు ఖరారైంది. దీంతో ఎన్నికల ప్రచారంపై రెండు పార్టీలు దృష్టిని కేంద్రీకరించాయి. ఇదే క్రమంలో కేంద్ర పాలిత ప్రాంతంలో రాహుల్ ప్రచారం చేయాలని ఎన్సీ-కాంగ్రెస్ అభ్యర్థులు కోరుకోవడంతో జమ్మూతో పాటు కశ్మీర్‌లో నిర్వహించే రెండు ర్యాలీలకు ఆయన హాజరవుతారని మీర్ చెప్పారు. తమ ఆహ్వానాన్ని స్వీకరించి రాహుల్ ప్రచారానికి వస్తుండటం హర్షణీయమని, ఇది తొలి దశ కోసం ప్రచారమేనని, తర్వాత దశల కోసం రాహుల్ మళ్లీ జమ్మూకశ్మీర్‌ను సందర్శిస్తారని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా మొత్తం 40 మంది ప్రచార తారలను కాంగ్రెస్ రంగంలోకి దించనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీర్ వెల్లడించారు. జమ్మూలోని సంగల్దన్ ప్రాంతంలో నిర్వహించే మరొక ర్యాలీలోనూ రాహుల్ గాంధీ పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

3 రాష్ట్రాలకు పీసీసీ అధ్యక్షుల పేర్లు ఖరారు?

బెంగాల్‌కు దీపాదాస్, కేరళకు వేణుగోపాల్, తెలంగాణకు మహేశ్‌కుమార్ గౌడ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకు పీసీసీ అధ్యక్షుల ఎంపికను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జాబితా సిద్ధమైందని, ఏక్షణమైనా పేర్లను ప్రకటిస్తామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్ పీసీసీ చీఫ్‌గా దీపాదాస్ మున్షీ, కేరళకు కేసీ వేణుగోపాల్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ పేరు ఖరారు అయినట్లు తెలుస్తోంది. కేరళ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కేసీ వేణుగోపాల్ స్థానంలో రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్, తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా దీపాదాస్ మున్షీ స్థానంలో చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భఘేల్‌ని నియమించనున్నట్లు తెలుస్తోంది. బొమ్మ మహేష్ గౌడ్ 1966 ఫిబ్రవరి 24న నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం రహత్‌నగర్‌లో జన్మించారు. 1986లో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. తొలిసారిగా 1994లో కాంగ్రెస్ అభ్యర్థిగా డిచ్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి... ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2013 నుంచి 2014 వరకు గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ అయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహేశ్‌గౌడ్ పోటీ చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం పీసీసీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2018లో నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించారు కానీ ఆ స్థానాన్ని అధిష్ఠానం మైనార్టీలకు కేటాయించడంతో పోటీ నుంచి తప్పుకున్నారు. 2021 జూన్ 26న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, 2022 డిసెంబర్ 10న కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కార్యనిర్వాహక కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా, 2023 జూన్ 20న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు.

చైనాతో ఇతర దేశాలకూ సమస్యే: జైశంకర్

న్యూఢిల్లీ: భారత్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలు చైనా నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. వాటితో పోలిస్తే భారత్‌కు ఉన్న సమస్య ఇంకాస్త ఎక్కువని తెలిపారు. ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ శనివారం నిర్వహించిన ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. 'సరిహద్దు వివాదం కారణంగా చైనాతో మనకు సమస్య ఉంది. అలాగని చైనాతో మనకు మాత్రమే కాదు. ప్రపంచంలోని పలు దేశాలూ తలనొప్పి ఎదుర్కొంటున్నాయి. ప్రపంచంలో ఏమూలకు వెళ్లినా ఆ దేశం గురించి చర్చించుకుంటూ ఉంటారు. యూరప్ వెళితే చైనా నుంచి ఎదురవుతున్న ఆర్థిక, జాతీయభద్రత ముప్పు గురించి ప్రస్తావిస్తారు. అమెరికా వెళ్లినా ఇదే సమస్య. చైనాతో భారత్‌కు మాత్రమే సమస్య అని భావించకూడదు' అన్నారు. 'దశాబ్దాల క్రితం ప్రపంచదేశాలు చైనా సమస్యను పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా మారింది. ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు చైనాతో మనకున్న సమస్యను మరింత తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా సరిహద్దు పంచుకుంటున్నందున భారత్ వంటి దేశాలు అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని జైశంకర్ పేర్కొన్నారు. ఆ దేశం నుంచి పెట్టుబడుల గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... చైనా నుంచి పెట్టుబడులు ఆహ్వానించకూడదని గానీ, ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు నెరపకూడదని గానీ ప్రభుత్వం అనుకోవడం లేదన్నారు. అక్కడ నుంచి వచ్చే పెట్టుబడుల విషయంలో నిశిత పరిశీలన అవసరమన్నారు. కేవలం చైనా నుంచి వచ్చే పెట్టుబడులు మాత్రమే కాదు, ఏ పెట్టుబడుల విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొన్నారు.

నాణ్యమైన ఉద్యోగాలు అవసరం

కార్మిక కోడ్‌లపై సంప్రదింపులు చేపట్టండి: కేంద్రం

న్యూఢిల్లీ : నాణ్యమైన ఉద్యోగాల సృష్టిపై దృష్టి పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించింది. ఉపాధి కల్పన, అసంఘటిత రంగ కార్మికుల వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌తో అనుసంధానం చేయడం, ఉపాధి రిటర్న్‌లు, ఉద్యోగాల మేళా వివరాలను సకాలంలో, క్రమం తప్పకుండా సమర్పించడం, నాలుగు కార్మిక కోడ్‌లను అంతటా నిబంధనలను రూపొందించడానికి సంప్రదింపుల విధానాన్ని చేపట్టడం చేయాలని కోరింది. బెంగళూరులో శుక్రవారం కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవుల ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరిగిన ప్రాంతీయ సమావేశంలో కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వచ్చే నెలలో రాష్ట్రాలతో మరో ఐదు ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలని యోచిస్తోంది. మూడు ఉపాధి-అనుబంధ ప్రోత్సాహక పథకాల కింద ఉపాధి ఉత్పత్తిని పెంచడంలో, కార్మిక సంస్కరణలను వేగంగా అమలు చేయడంలో రాష్ట్రాలు ఎక్కువగా పాల్గొనడం లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశం తర్వాత మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, కార్మిక సంస్కరణలు, ఇ-శ్రమ్ పోర్టల్, భవన, ఇతర నిర్మాణ కార్మికులు (బీవోసీడబ్ల్యూ), ఉపాధి కల్పనను పెంచడం గురించి చర్చలు జరిగాయి.

అన్ని రాష్ట్రాలు తమ దశలను ఇతర రాష్ట్రాలతో, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం దృష్టితో సమలేఖనం చేసుకోవాలని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా మాట్లాడుతూ కార్మిక రంగాన్ని సంస్కరించడంలో 'మొత్తం ప్రభుత్వ' విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.

విమానం నుంచి జారి పడిన హెలికాప్టర్

డెహ్రాడున్: మరమ్మతులకు గురైన ఓ హెలికాప్టర్‌ను ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ తరలిస్తుండగా ఒక్కసారిగా గాలిలోనే జారి నదిలో పడిపోయింది. ఇటీవల కేదార్‌నాథ్ సమీపంలోని భీంబాలి వద్ద ఓ హెలికాప్టర్ మరమ్మతులకు గురైంది. అయితే దానిని శనివారం ఎంఐ17 హెలికాప్టర్‌తో అధికారులు దానిని తరలిస్తుండగానే ఎంఐ17 హెలికాప్టర్ తీగ తెగి నదిలో పడిపోయింది. ఈ ఘటనకు సంబంధించి వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. 'ఎంఐ-17 హైలికాప్టర్ మరమ్మత్తులకు గురైన చిన్న హెలికాప్టర్‌ను గౌచర్ ల్యాండింగ్ స్ట్రిప్‌కు తీసుకువెళుతోంది. గాలి పీడనం, హెలికాప్టర్ బరువు కారణంగా ఎంఐ-17 హెలికాప్టర్ బ్యాలెన్స్ కోల్పోయింది.

సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం

స్టీల్ ప్లాంట్ వద్ద ధర్నాలో అమర్‌జిత్ కౌర్ డిమాండ్

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమను నూటికి నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు జీతాల్లో కోత తగదని తెలిపారు. శనివారం ఉదయం ఉక్కు ఎల్‌డీసీ వద్ద ఏఐయూటీసీ అధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా ఏర్పాటయిన ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం తన అనుకూల పెట్టుబడి దారులకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం ఉక్కుకు కావలసిన ఐరన్ ఓర్, ఇతర ముడిసరుకులు సరఫరా చేసి విశాఖ ఉక్కు మనుగడకు కృషి చేయాలని కోరారు. ఈ పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ఐక్య ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలు ఆపాలని, కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తెచ్చిన 4 కోడ్‌లు రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని, పెన్షన్ పాత విధానంలోనే చెల్లించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్ర నాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఏఐటీయూసీ ఉక్కు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్.రావు, డి.ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, నాయకులు మసేన్ రావు, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, ప్రసన్న కుమార్, డొక్కా నర్సింగరావు, జి.జయ, డి.దేముడు, జి.ఆనంద్, మీరా, టి.ఎస్.ఎన్ తదితరులు పాల్గొన్నారు.

26 సాగర్ గేట్లు ఎత్తివేత

ప్రకాశం బ్యారేజీ నుంచి 3.42 లక్షల క్యూసెక్కుల విడుదల

విశాలాంధ్ర-విజయపురిసౌత్/విజయవాడ: భారీ వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానదిపై రాష్ట్రంలో ఉన్న జలాశయాలన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. ఎగువన భారీగా వర్షాలు కురవడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.90 అడుగులు ఉంది. శ్రీశైలం నుంచి సాగర్ రిజర్వాయర్‌కు 3,35,586 వేల క్యూ సెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతుండటంతో అధికారులు డ్యామ్ 12 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 14 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 3,35,586 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం పూర్తి స్థాయి నీరు నిల్వ ఉంది. ఇదే ఇన్ ఫ్లో మరో మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని డ్యామ్ అధికారులు తెలిపారు. సాగర్ నుంచి భారీగా వరద నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతుండటంతో అక్కడ అన్నీ గేట్లు ఎత్తి దిగువన ప్రకాశం బ్యారేజీకి నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు. భారీ వరద నీరు రావటంతో 70 క్రస్ట్ గేట్లు పైకిఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. 20 గేట్లు పూర్తిగాను, 50 గేట్లు 8 అడుగులు పైకి ఎత్తి 3.42 లక్షల క్యూసెక్కుల సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

సామాన్యులపై భారం... కార్పొరేట్లకు ఊతం

మోదీ సర్కారు తీరుపై జేవీ సత్యనారాయణమూర్తి మండిపాటు

విశాలాంధ్ర-చింతపల్లి (అల్లూరి జిల్లా): సామాన్యులపై ధరల భారం మోపి... కార్పొరేట్ శక్తులను కుబేరులను చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ నైజమని, ఇందులో భాగంగానే పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురాకుండా కార్పొరేట్ దిగ్గజాలకు ప్రజాధనం దోచిపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. సీపీఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్వర్యంలో శనివారం స్థానిక వర్తక సంఘం భవనంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశాన్ని ఏ విధంగా పునర్నిర్మించారో ఆ స్థాయికి మోదీ ఎన్నటికీ చేరుకోలేరని తెలిపారు. మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి దేశ సంపదను కొద్దిమంది కార్పొరేటర్లకు ఎలా దోచి పెట్టాలనే దానిపైనే ఉత్సాహాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. ఆ క్రమంలోనే కుబేరునిగా ముందు వరసలో ఉన్న ముకేశ్ అంబానీని మించి నేడు అదానీ ముందుకు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ కొద్దిమంది కార్పొరేట్లకే సంపద చేకూరుతుంది తప్ప సామాన్య ప్రజలు మాత్రం ఉపాధి, ఆదాయాలు కోల్పోయి నిరుపేదలుగా మారి ఆకలితో అలమటించే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సామాన్యుడు సంపాదించే సంపాదనలో 62 శాతం పన్నుల రూపంలోనే ప్రభుత్వానికి తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మోదీ సంకీర్ణ ధర్మాన్ని పాటించకుండా పాత పద్ధతుల్లోనే పరిపాలన సాగిస్తుండటంతో నిత్యావసర సరుకుల ధరలు నింగినంటాయని విమర్శించారు. వాటిని నియంత్రించవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్‌తో, పెరుగుతున్న నిత్యవసర సరకుల ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సెప్టెంబరు ఒకటి నుంచి 6వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఐ పిలుపునిచ్చిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సర్పంచ్ పేట్ల రాజబాబు, ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సత్తిబాబు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దీసరి బిమలమ్మ, జికే వీధి మండల కార్యదర్శి, కంకిపాటి సత్తిబాబు, చింతపల్లి మాజీ ఉపసర్పంచ్ గంజారి రమణ, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమరణ దీక్షాపరులకు నారాయణ పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో బీసీ కులగణ చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర పటేల్, సంజయ్ కుమార్‌లను శనివారం సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల్ మల్లేశ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ తదితరులు పరామర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం జోక్యం చేసుకొని, వీరి డిమాండ్ ను సానుకూలంగా పరిశీలించి దీక్షలను విరమింప చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ప్రజాప్రతినిధులకు ఇంటికే మందులు

ఏపీ మాజీ లెజిస్లేచర్స్ ఫోరమ్ నేతలు శివారెడ్డి, జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇండియన్ పోస్టల్ కొరియర్ ద్వారా మాజీ ప్రజాప్రతినిధుల ఇంటికే స్వయంగా మందుల పంపిణీకి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆంధ్ర ప్రదేశ్ మాజీ లెజిస్లేచర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.శివారెడ్డి (మాజీ ఎమ్మెల్సీ), రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లి విల్సన్ (మాజీ ఎమ్మెల్సీ) శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ మాజీ లెజిస్లేచర్స్ ఫోరమ్ అధ్వర్యంలో ఇటీవల వెలగపూడి సచివాలయంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుకు శివారెడ్డి, జల్లి విల్సన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులకు మందుల విషయంలో 10 నెలలుగా వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వాల నుంచి మందుల పంపిణీలో జాప్యం కారణంగా అనారోగ్యానికి గురైన మాజీ ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయనకు తెలిపారు. ఆయా సమస్యలను ఇప్పటికే ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చినట్లు వారు గుర్తుచేశారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ అధినేతలకు తమ ఫోరమ్ నేతృత్వంలో మాజీ ప్రజాప్రతినిధుల ఇంటికే మందులు పంపిణీ చేయాలని వినతి పత్రాలు అందజేసిన విషయాన్ని కృష్ణబాబుకు నేతలు తెలిపారు. దీంతో పాటు మాజీ ప్రజాప్రతినిధుల ఆరోగ్యశ్రీ బిల్లుల విషయంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి ఎలాంటి కోతలు లేకుండా మంజూరు చేయాలని కోరారు. మంత్రులు, ఐఏఎస్ స్థాయి అధికారులకు వైద్య బిల్లుల విషయాల్లో ఉన్న అవకాశాల తరహాగా మాజీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి పరిమితి లేకుండా వర్తింప జేయాలన్నారు. అనంతరం కృష్ణబాబు మాట్లాడుతూ ఇండియన్ పోస్టల్ కొరియర్ విధానం ద్వారా మాజీ ప్రజా ప్రతినిధుల ఇళ్లకే మందుల పంపిణీకి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించినట్లు, ఇందుకోసం ప్రభుత్వం టెండర్లు పిలిచినట్లు ఫోరమ్ నేతలకు వివరిం చారు. అవసరమైన మందులను మెరుగైన ప్యాకింగ్ ద్వారా నిరంతరం వారి ఇంటికే పంపిణీ చేసే ప్రక్రియను అక్టోబరు మొదటి వారంలో ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. దీనిపై విధి విధానాలు, సమాచారాన్ని ఆంధ్ర ప్రదేశ్ మాజీ లెజిస్లేచర్స్ ఫోరమ్ ప్రతినిధులకు అందజేస్తామన్నారు. మందుల సరఫరా నుంచి వారి వైద్య సేవలకు సంబంధించి యాప్‌ను రూపొందిస్తామని, వారికి ఎలాంటి అవాంతరాలు లేకుండా క్రమంగా వైద్యారోగ్య శాఖ నుంచి నిరంతర చర్యలు తీసుకుంటామని కృష్ణబాబు హామీ ఇచ్చారు.

విజయవాడలో మహా విషాదం

కొండచరియలు విరిగిపడి ఐదుగురి మృతి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఇద్దరు గల్లంతయ్యారు. వారి కోసం కొండరాళ్లు, మట్టి గెడ్డలను అధికారులు తొలగిస్తున్నారు. నగరంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. అనూహ్యంగా విజయవాడ నగరంలో రికార్డు స్థాయిలో 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా మొగల్రాజపురం, వన్‌టౌన్ కొత్తపేట, దుర్గగుడి కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. మొగల్రాజపురంలోని సున్నపుబట్టీల ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడటంతో ఒక డాబా ఇల్లు, మరో రెండు పోర్షన్ల రేకుల షెడ్డు ధ్వంసమయ్యాయి. ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న నలుగురు మృతిచెందారు. లక్ష్మి(49), నవుడు మేఘన(24), జంపన అన్నపూర్ణ అనే మహిళలతోపాటు కోల్‌కతాకు చెందిన లల్లు, సంతోష్ (30) మరణించారు. అదేవిధంగా మరో ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. వారి కోసం శిథిలాలు తొలగిస్తున్నారు. ఈ ఘటనలోనే మరో నలుగురికి గాయాలయ్యాయి. కొండ చరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందిన ప్రదేశాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు కొత్తపేటలోని పితాని అప్పలస్వామి వీధిలో కొండచరియలు విరిగిపడి మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.